# నేటి నుండి 26 వరకు జిల్లాలో తుఫాన్ ప్రభావం!

**-బంగాళాఖాతంలో ఉత్తర, మధ్య బంగాళాఖాతంలోకి మత్స్యకారులు వెళ్లరాదు**
**-కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు: 0877-2236004**
**- తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి**



తిరుపతిరూరల్, అక్టోబర్21 ప్రభాతవార్త: స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేటింగ్ సెంటర్ నుండి వచ్చిన సమాచారం మేరకు ఈనెల 22 నుండి 26వ తేదీ వరకు జిల్లాలో తుఫాన్ ప్రభావం ఉండబోతున్నందున బంగాళా ఖాతంలోని ఉత్తర, మధ్య బంగాళాఖాతంలోకి మత్స్యకారులు వెళ్ళరాదని తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తుఫాన్ ప్రభావం కారణంగా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి 0877-2236004 నెంబర్‌ను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అన్ని లైన్ డిపార్టుమెంట్స్ జిల్లాలోని తీర ప్రాంత మండలాలు తడ, సూళ్లూరుపేట, వాకాడు, కోట, చిల్లకూరు మండలాల్లో ప్రజలు, అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. మానవ, ఇతర నష్టాలను నివారించటానికి పోలీసు, రవాణా, టెలికమ్యూనికేషన్స్, పవర్, డ్రింకింగ్ వాటర్ మొదలైన అత్యవసర సేవలు అందించటానికి అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. ఎలాంటి విపత్తునైన ఎదుర్కొవటానికి పూర్తి సన్నద్ధంగా ఉండాలన్నారు.

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త





## ఆర్థికశాఖ మంత్రిని...అప్పులశాఖ మంత్రిగా చేశారు

**-కేంద్ర, రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి రావడం ఖాయం-భానుప్రకాష్‌రెడ్డి**



శ్రీకాళహస్తి, అక్టోబర్ 21 ప్రభాత వార్త : రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రిని అప్పులశాఖ మంత్రిగా చేసిన ఘనత ఒక్క సిఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం రాష్ట్ర మీడియా ప్రతినిధి కోలా ఆనంద్ సారథ్యంలో పాత్రికేయులు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ పర్యటకు పవన్‌కళ్యాణ్ మూడు నెలల ముందే అనుమతి కోరుతూ దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. పవన్‌పర్యటనలో హైడ్రామలునడిపిన అధికార పార్టీ సెక్షన్ 30 అమలులో ఉందంటూ తెలిపారని అయితే ఇది అధికారపార్టీకి కూడా వర్తిస్తుందన్నారు. ప్రతిపక్షనాయకులు కూడా మాట్లాడే పరిస్థితి లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఐపిసి సెక్షన్లు పనిచేయడం లేదని వైకాపా నాయకులు మండల నాయకులు ఏంచెపితే పోలీసులు అదే చేస్తున్నారని విమర్శించారు. ఐదేళ్ళ తర్వాత అవినీతికి పాల్పడిన అధికారులందరూ జైలుకే అన్నది వారు గుర్తుంచు కోవాలన్నారు. వైకాపా 3సంవత్సరాల 7నెలల కాలంలో అభివృద్ధి లేదని రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలో నెట్టివేసిన ఘనత వైకాపాదే అన్నారు. రూ.350లక్షల కోట్లు ఉన్న అప్పులు నేడు రాష్ట్రంలో రూ.8.50లక్షలుకు పెరిగాయన్నారు. నేడు కులాల గురించి కూడా మాట్లాడాల్సి వస్తుందని తాను కూడా అనుకోలేదని అయితే కొన్ని పరిస్థితుల వల్ల మాట్లాడాల్సి వస్తుందన్నారు. అమరరాజా పరిశ్రమలో సామాజిక వర్గానికి చెందిన పాలనగా గుర్తించారని , ప్రజలు రాష్ట్ర ప్రభుత్వంపై పోస్టులు పెడితే అరెస్టులు చేస్తున్నారన్నారు. జగన్ ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ ప్రారంభం అయ్యిందన్నారు. అటు రాష్ట్రంలోను, అటు కేంద్రంలోను బిజెపి ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయం అన్నారు. అసెంబ్లీలో కుటుంబసభ్యులను గురించి మాట్లాడడం తగదని పేర్కొన్నారు. రాష్ట్రంలో రాక్షసపాలన రాజ్యమేలుతోందని తిరుపతిలో రెండు రోజులు క్రితం ఎంఎల్‌ఏ ధర్నాకు పిలుపునిస్తే పోలీసులు ఓవర్‌యాక్షన్ చేశారన్నారు. జగన్ తాడేపల్లి గూడెం మార్గం నుంచి రావాలంటే ప్రతి ఇంటి వద్ద గన్‌మెన్‌లు ఉండాలని ఎద్దేవాచేశారు. స్థానిక సంస్థలు ఎన్నికలు కాదని ఇవి కేవలం సెలక్షన్స్ మాత్రమే అని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో ప్రజలే ప్రభుత్వాలకు బుద్ధిచెప్తారని పేర్కొన్నారు. సమావేశంలో రాష్ట్ర మీడియా ప్రతినిధి కోలా.ఆనంద్‌కుమార్ నాయకులు గరికపాటిరమేష్‌బాబు, చిలకారంగయ్య, కిషోర్, సుకుమార్,పలువురు నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

## అందరి కళ్లూ అంతరిక్షం వైపు

**- నేటి అర్ధరాత్రి బాహుబలి రాకెట్ ప్రయోగం - ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న ఇస్రో ఛైర్మన్ సోమనాథ్ - షార్‌లో ముగిసిన కీలక సమావేశాలు**



శ్రీహరికోటలోని సెకండ్ లాంచ్ ప్యాడ్‌పై విద్యుత్ వెలుగులతో జీఎస్ఎల్‌వీ మార్క్3 రాకెట్

శ్రీహరికోట (తడ), అక్టోబర్ 21 ప్రభాతవార్త : శ్రీహరికోట మరో భారీ రాకెట్ ప్రయోగానికి సిద్ధమైంది. శనివారం అర్ధరాత్రి 12.07 గంటలకు జీఎస్ఎల్‌వీ మార్క్3 రాకెట్‌ను సెకండ్ లాంచ్ ప్యాడ్ నుంచి ప్రయోగిస్తున్నారు. ఎల్‌వీఎం3-ఎం2 పేరుతో ఈ రాకెట్‌ను శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్ ఆధ్వర్యంలో రాకెట్ ప్రయోగ సన్నాహాలు చేస్తున్నారు. శుక్రవారం ఉదయం నుంచి శాస్త్రవేత్తలు కీలక సమావేశాలు నిర్వహించారు. మొదట మిషన్ రెడీనెస్ రివ్యూ సమావేశం, ఆ తర్వాత లాంచ్ ఆథరైజేషన్ బోర్డ్ సమావేశాలు నిర్వహించారు. అర్ధరాత్రి 12.07 గంటలకు కౌంట్‌డౌన్‌ను ప్రారంభించారు. 24 గంటల కౌంట్‌డౌన్ అనంతరం శనివారం అర్ధరాత్రి 12.07 గంటలకు ఈ రాకెట్ 36 యూకేకి చెందిన ఉపగ్రహాలను నింగికి మోసుకెళ్లనుంది. షార్‌లో ఈ ఏడాది ఇప్పటికే సరికొత్త రాకెట్ ఎస్ఎస్ఎల్‌వీ ప్రయోగ విఫలం శాస్త్రవేత్తలను నిరాశపరిచింది. ప్రస్తుత బాహుబలి రాకెట్‌ను విజయవంతంగా అంతరిక్షయానం చేయించి తద్వారా ఇస్రోకు విదేశీ డాలర్ల పంట పండించాలని శాస్త్రవేత్తలు మొక్కవోని దీక్షతో రేయింబవళ్లు శ్రమిస్తున్నారు. ఈ అతిపెద్ద రాకెట్ ప్రయోగాన్ని దగ్గరగా వీక్షించేందుకు ఇక్కడ వీక్షకుల గ్యాలరీని సిద్ధం చేశారు. కౌంట్‌డౌన్ సమయంలో ద్రవ ఇంధన దశను నింపడంతో పాటు ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్, కంప్యూటర్ల వ్యవస్థను, పవర్ తనిఖీలను సరిచూసుకొని రాకెట్‌ను ప్రయోగానికి సిద్ధం చేస్తారు. షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్‌తో పాటు మిషన్ డైరెక్టర్ వి.భాస్కర్, వెహికల్ డైరెక్టర్ నారాయణన్, వివిధ ఇస్రో కేంద్రాల డైరెక్టర్లు షార్‌ను చేరుకున్నారు. వీరికితోడు శాటిలైట్ డైరెక్టర్లుగా ఉన్న యూకేకి చెందిన ఈసా శాస్త్రవేత్తలు, వన్‌వెబ్ కంపెనీ ప్రతినిధులు, ప్రత్యేకించి వన్‌వెబ్‌లో భాగస్తులైన భారతి ఇండియా యజమాని సునీల్‌భారతి మిట్టల్ తదితరులు షార్‌కు చేరుకొని ప్రయోగ సన్నాహాల్లో భాగం పంచుకుంటున్నారు. శ్రీహరికోట, పరిసరాల్లో ఇప్పటికే తనిఖీలు పూర్తి చేశారు. స్థానిక పోలీసులు, సీఐఎస్ఎఫ్ దళాలు కంటికి రెప్పలా కాపలా కాస్తున్నారు. అర్ధరాత్రి ప్రయోగం కావడంతో రక్షణపరంగా మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటూ రాకెట్ ప్రయోగానికి అన్ని విభాగాల వారు సిద్ధమవుతున్నారు.

**షార్‌లో ఇస్రో ఛైర్మన్ సోమనాథ్ బిజీ బిజీ :**



శ్రీహరికోట అంతరిక్ష ప్రయోగ కేంద్రంలో ఇస్రో ఛైర్మన్ సోమనాథ శుక్రవారం బిజీబిజీగా పర్యటించారు. సౌండింగ్ రాకెట్ కాంప్లెక్స్ తో పాటు మొదటి, రెండవ లాంచ్‌పాడ్‌లను ఆయన సందర్శించారు. మొదట ప్రయోగ వేదిక వద్ద పిఎస్ఎల్‌వి సి54 రాకెట్‌ను పరిశీలించారు. అనంతరం ప్రయోగానికి సిద్ధంగా వున్న జిఎస్ఎల్‌వి మార్క్3 భారీ రాకెట్ వద్ద ఎక్కువ సమయం గడిపారు. అక్కడే శాస్త్రవేత్తలతో రాకెట్ ప్రయోగ ఏర్పాట్లు గురించి మాట్లాడారు. కొన్ని ప్రైవేటు సంస్థల వారితోనూ ఆయన భవిష్యత్తు అంతరిక్ష కార్యక్రమాల గురించి చర్చించినట్లు సమాచారం. సోమనాథ్‌తో పాటు షార్ డైరెక్టర్ ఏ.రాజ రాజ్, విఎస్ఎస్‌సి డైరెక్టర్ కున్ని కృష్ణన్ నాయర్, ఐపిఆర్‌సి డైరెక్టర్ బద్రీనారాయణ మూర్తి, షార్ అసోసియేట్‌డైరెక్టర్ వెంకట్రామన్, కంట్రోలర్ శ్రీనివాసులురెడ్డి పలు విభాగాల డిప్యూటీ డైరెక్టర్లరు వున్నారు. దీనిలో భాగంగానే ఇస్రో ఛైర్మన్ సోమనాథ్ శనివారం ఉదయం సూళ్ళూరుపేట చెంగాళ్ళమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

## పోలీసు అమర వీరుల... త్యాగాలు చిరస్మరణీయం

**- అమరులైన పోలీసు కుటుంబాలకు అండ**
**- పోలీసు అమరవీరుల స్థూపానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.బీమరావ్, ఎస్పీ రిశాంత్‌రెడ్డి, జెసీ వెంకటేశ్వర్‌లు ఘన నివాళి**



అమరవీరుల స్థూపంకు నివాళులు అర్పిస్తున్న జిల్లా జడ్జి, ఎస్పీ, జాయింట్ కలెక్టర్

చిత్తూరు, అక్టోబర్ 21 ప్రభాతవార్త: విధి నిర్వహణలో ఆశువులు బాసిన పోలీసు అమర వీరుల త్యాగాలు చిరస్మరణీయమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.బీమారావ్ అన్నారు. పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం చిత్తూరు ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పెరేడ్ మైదానంలో అమరవీరుల స్థూపం వద్ద స్మృతి పెరేడ్ నిర్వహించారు. ఈ పెరేడ్‌కు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.బీమరావ్, జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ రిశాంత్‌రెడ్డిలు హాజరై పోలీసు గౌరవ వందనంను స్వీకరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.బీమరావు మాట్లాడుతూ దేశ, రాష్ట్ర శాంతిభద్రతల పరిరక్షణలో ఒక ఏడాదిలో 287 మంది పోలీసులు విధులు నిర్వహిస్తూ అమరులైనారన్నారు. అమరులైన పోలీసులందరికీ నివాళులు అర్పిస్తున్నా మన్నారు. పోలీసు అమర వీరులను స్మరించుకొని నేడు పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవంను నిర్వహించుకొంటున్నా మన్నారు. పోలీసు శాఖ ప్రజా శ్రేయస్సు, శాంతిభద్రతలు లక్ష్యంగా ముందడుగు వేస్తోందన్నారు. సమాజంలో ఎవరికి ఏ సమస్య వచ్చినా పోలీసులు ప్రాణాలు ఎదురొడ్డి నిలుస్తున్నా రన్నారు. ఇలాంటి పోలీసులకు ప్రజల నుండి సహకారం ఎంతో అవసరం అన్నారు. జిల్లా పోలీసులు ఇతరులకు అండగా నిలిచి అనేక రకాలుగా ఆదుకొంటున్నారన్నారు. పోలీసుల కష్టాన్ని గుర్తిస్తే అదే వారికి సంతోషం కల్పిస్తుందన్నారు. సమాజంలో ప్రజలు, విద్యార్థులు క్రమశిక్షణగా మెలగడానికి అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని ఎస్పీ, జాయింట్ కలెక్టర్లను కోరుతున్నానన్నారు. పోలీసులు లేని సమాజంను ఎవరు ఊహించుకోవడం సాధ్యం కాదన్నారు. శాంతిభద్రతల కట్టడిలో పోలీసు శాఖ కీలకంగా విధులు నిర్వహిస్తోందని, వీరి సేవలను ప్రజలు ఎప్పుడు గుర్తించుకొంటారన్నారు. జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ 1959 అక్టోబర్ 21న జరిగిన దురదృష్ట సంఘటనను గుర్తు చేసుకొని వారి త్యాగాలను స్మరించుకోవడం కోసం ప్రతి సంవత్సరం అమర వీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించుకొంటున్నామన్నారు. అమర వీరుల త్యాగాలు స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఎస్పీ రిశాంత్‌రెడ్డి మాట్లాడుతూ దేశం కోసం ఎంతోమంది జవాన్లు ప్రాణాలను అర్పించారన్నారు. అలాగే ప్రజా రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన పోలీసులను స్మరించుకొంటూ ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించుకొంటున్నామన్నారు. సమాజం కోసం, భవిష్యత్ తరాల కోసం, ప్రజా రక్షణ కోసం పోలీసులు అహర్నిశలు తమ ప్రాణాలను లెక్కచేయకుండా విధులు నిర్వహిస్తున్నా రన్నారు. ఈ సందర్భంగా అమరులైన పోలీసులను స్మరిస్తూ అందరు రెండు నిముషాల పాటు మౌనం పాటించారు. అలాగే ఈ సందర్భంగా అమరులైన పోలీసు కుటుంబ సభ్యులను శాలువతో సన్మానించి జ్ఞాపికలు బహుకరించారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ అడిషనల్ ఎస్పీ జగదీష్, ఆపరేషన్స్ అడిషనల్ ఎస్పీ డాక్టర్ కెవి శ్రీనివాసరావు, చిత్తూరు నగర డిఎస్పీ సుధాకర్‌రెడ్డి, ఎస్‌బి డిఎస్పీ శ్రీనివాసులురెడ్డి, మహిళా స్టేషన్ డిఎస్పీ బాబు రాజేంద్రప్రసాద్, ఏఆర్ డిఎస్పీ లక్ష్మీనారాయణరెడ్డి, సిసిఎస్ డిఎస్పీ శ్రీనివాసులు, ట్రాఫిక్ డిఎస్పీ తిప్పేస్వామి, ఆర్‌ఐలు నీలకంఠేశ్వరరెడ్డి, మధు, నగర పరిధిలోని ఇన్స్‌పెక్టర్లు, ఎస్‌ఐలు, జిల్లా పోలీసు కార్యాలయ అధికారులు, సిబ్బంది హాజరయ్యారు.

## సకాలంలో ఎరువులు అందించాలి

**-ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించాలి : కలెక్టర్**



తిరుపతిరూరల్, అక్టోబర్21 ప్రభాతవార్త: రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు సకాలంలో ఎరువులు, పెస్టిసైడ్స్ అందించాలని తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకట రమణారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశ మందిరములో కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. ధాన్యం కొనుగోలు, రైతు భరోసా కేంద్రాల పనితీరు, రైతులకు వ్యక్తిగత వ్యవసాయ పని ముట్లు రాయితీ, ఫెర్టిలైజర్స్‌ను రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువుల పంపిణీ, ప్రకృతి వ్యవసాయం, డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింకర్స్, సబ్సీడిపై సరఫరా అంశాలపై చర్చా నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి కో-చైర్మెన్, కలెక్టర్ వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా సకాలంలో ఎరువుల పంపిణీ చేసేలా సంబంధిత అధికారులు దృష్టి పెట్టాలన్నారు. రైతుల ఆధాయన్ని పెంపొందించే దిశగా వ్యవసాయ సంబంధించిన సరైన సలహాలు, సూచనలు ఇవ్వాలనే ఉద్దేశంతో ప్రతి నెల అడ్వజరీ కమిటీ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ మధ్య ఈ-క్రాప్‌ను నాయుడుపేట, తొట్టంబేడు మండలాల్లో పరిశీలించగా రైతుల నుండి తెలుసుకున్న కొన్ని విషయాలు తెలుసుకోవడం జరిగిందన్నారు. రైతులు తరచూ వాడే ఎరువులు ఆర్‌బికెల ద్వారా సమయానికి అందడం లేదని, ఆలస్యం జరుగుతుందని, అలా కాకుండా రైతులకు ఎక్కువగా వాడే మందులను, ఎరువులను స్టాక్ ఉంచుకుని, రైతులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మెన్ రఘనాథరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో రైతులు ప్రకృతి వ్యవసాయం పైన అవగాహన పెంచుకొని, ఆ దిశగా వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయాలన్నారు. ఈ సమీక్షలో వ్యవసాయశాఖ డి.డిప్రసాదరావు, ఉద్యానశాఖ అధికారి దశరథరామిరెడ్డి, పశుసంవర్ధకశాఖ వెంకటేశ్వర్లు, సిరి కల్చర్ అధికారి గీతారాణి, మత్స్యశాఖ అధికారి శ్రీనివాస నాయక్, సీనియర్ సైంటిస్ట్ సునీత, లీడ్ బ్యాంకు మేనేజర్ సుభాష్, జిల్లా వ్యవసాయ ట్రేడ్ మార్కెట్ అధికారి సురేంద్రబాబు, ఏ.పి. సీడ్స్ మేనేజర్ సంపత్‌కుమార్, డిఎఫ్ఓ శ్రీనివాస నాయక్, సలహా మండలి సభ్యులు శేషిరెడ్డి పాల్గొన్నారు.

## సందర్శకుల సంఖ్య పెంచడమే లక్ష్యం!

**-పర్యావరణంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు**
**-ఎస్వీ జూపార్కు క్యూరేటర్ సెల్వం వెల్లడి**



జూపార్కు క్యూరేటర్ సెల్వం

తిరుపతి ప్రెస్‌క్లబ్,అక్టోబర్ 21 ప్రభాతవార్త: ప్రస్తుతం ఏడాదికి 4 లక్షల నుండి 5 లక్షల మంది వరకు సందర్శకులు జూపార్కుకు వస్తున్నారు.ఆ సంఖ్యను 7 లక్షల మందికి పెంచాలన్నదే తమ లక్ష్యమని శ్రీ వెంకటేశ్వర జంతు ప్రదర్శనశాల క్యూరేటర్ సెల్వం స్పష్టం చేశారు.శుక్రవారం వార్త ప్రతినిధితో ఆయన మాట్లాడుతూ ప్రపంచ ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రమైన తిరుమలకు రోజుకు 70 వేల నుండి లక్ష వరకు భక్తులు వస్తుంటారు.వారిలో చాలా మంది తమ కుటుంబాలతో కలిసి జూపార్కు సందర్శనకు వస్తుంటారు.ముఖ్యంగా జూపార్కుకు వెళ్లాలంటే బెంగళూరు,మైసూరు,మన పక్కనున్న చెన్నై వెళ్లాలి.కానీ నెల్లూరు, కడప, చిత్తూరు జిల్లాల ప్రజలకు అందుబాటులో ఉన్నది ఎస్వీ జూపార్కు మాత్రమేనన్నారు.కావున దీనిని అన్ని రకాలుగా అభివృద్ధి చేసి పర్యాటకులు,జంతు ప్రేమికులను ఆకర్షించడమే ప్రధాన ఉద్దేశ్యమన్నారు. జూపార్కు మొత్తం చుట్టి రావాలంటే 6 కిలో మీటర్లు ఉన్నందున నడిచే ఓపిక లేని వారి కోసం 50 సైకిళ్లను, నాలుగు చక్రాల బ్యాటరీ వాహనాలను అందుబాటులో ఉంచామన్నారు.ప్రస్తుతం ఉన్న పక్షులు,జంతువుల తదితర వాటి సంఖ్య పెంచాల్సిన అవసరం ఉందన్నారు.సందర్శకులు జూపార్కులోకి ప్రవేశించినప్పటి నుండి తిరిగి వెళ్లే వరకు ఉల్లాసంగా గడపాలన్నదే తమ అభిమతమన్నారు.ప్రస్తుతం మూతబడిన సీతాకోక చిలుకల పార్కును త్వరలో ప్రారంభించి మరిన్ని రకాల సీతాకోకచిలుకలను ఇందులో ఏర్పాటు చేస్తామన్నారు. జూలో పెద్ద పెద్ద ఎన్‌క్లోజర్లు ఉన్నాయని,ప్రతి ఎన్‌క్లోజర్‌కు నాలుగు వైపులా జంతువు,పక్షుల పేర్లు,వాటి వివరాలను తెలిపే బోర్డులను నాలుగు వైపులా సందర్శకులు చదువుకునే ఏర్పాటు చేస్తామన్నారు.సవనీర్ షాపుల ద్వారా పర్యావరణ హితమైన వస్తువులు అమ్మకం ద్వారా రోజుకు 2 వేల రూ॥లు వస్తోంది.దానిని 5 వేల రూ॥లకు పెంచుకోవాలన్నారు.ఇక విద్యార్థుల విషయానికొస్తే..జూ ఆవరణలో జూ స్కూల్ నందు పర్యావరణం సబ్జక్టుపై వారికి ప్రొజెక్టర్,స్పీకర్ సిస్టంతో వీడియోలు చూపించి అవగాహన తరగతులు నిర్వహిస్తామన్నారు.దీనికోసం ఉదయం 9 నుండి సాయంత్రం 5 గంటల వరకు మధ్యాహ్నం భోజనంతో కూడిన ప్యాకేజీని త్వరలో ప్రారంభిస్తామన్నారు. దీనికోసం డిఈఓ,కలెక్టర్లను సంప్రదించి వారితో చర్చించి ఈ కార్యక్రమా న్ని ప్రారంభించడం జరుగుతుందన్నారు.విద్యార్థులకు జూపార్కులో కేవలం ఆహ్లాదాన్ని అందించడమే కాకుండా విజ్ఞానాన్ని కూడా అందించాలన్నదే తమ లక్ష్యమన్నారు.ఆఖరుగా ఆయన మాట్లాడుతూ గతంలో కరోనా కారణంగా రెండేళ్ల జూపార్కు ఆదాయం కోల్పోయింది.దానిని భర్తీ చేసుకోవడానికి అలాగే మరింత ఆదాయం పెంచుకోవడానికి తనతో పాటు జూ సిబ్బంది పూర్తి స్థాయిలో కృషి చేస్తున్నామన్నారు.జంతు ప్రేమికులైన దాతలు ముందుకొచ్చి పక్షులు,జంతువులను దత్తత తీసుకునే సౌకర్యం కూడా కల్పించామన్నారు.వివరాలకు 9440810066/ 9440810067 నెంబర్లను సంప్రదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## తోక పార్టీలెన్నొచ్చినా...జగన్‌రెడ్డికి ఎదురులేదు!

**-బాబు పవన్ బంధంపై స్పందించిన మంత్రి పెద్దిరెడ్డి -చెప్పులు చూపించే సంస్కృతిపై పెదవి విరుపు**



చౌడేపల్లి, అక్టోబర్ 21 ప్రభాతవార్త : రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి, వైకాపాలకు వ్యతిరేకంగా చంద్రబాబునాయుడుతోపాటు తోక పార్టీలెన్ని వచ్చినా తమకు ప్రజా బలముందనీ, ఎవరూ పోటీ కాదని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. స్థానిక మండల పరిపాలనా భవన ఆవరణంలో 3వ విడత వైఎస్సార్ చేయూత పంపిణీ కార్యక్రమం జరిగింది. చంద్రబాబు రాజకీయా ల్లోకి రాకముందే తాను క్రియాశీలక రాజకీయాల్లో చురుక్కా వుండేవాడన్నారు. ప్రస్తుతం బాబుతోపాటు అతని దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్‌లాంటి వారు ఎందరు వచ్చినా వైకాపా ప్రభుత్వానికి ఎలాంటి ఢోకా లేదన్నారు. రాష్ట్రంలో చెప్పులు చూపించే సంస్కృతి ఎన్నడూ లేదనీ, తాను 3పెళ్ళిళ్ళు చేసుకొని అందరూ చేసుకోండని అనడంలో మహిళామణులకు ఎలాంటి సూచనలిస్తున్నాడని ప్రశ్నించారు. జగన్‌రెడ్డి ఎదిరించాలంటే చంద్రబాబుకు ధైర్యం చాలదనీ, అందుకే తోకపార్టీలను కలుపుకొని ఎన్నికలకు వస్తున్నాడని ఎద్దేవా చేసారు. పులి ఒక్కటే వేటకు వెళుతుందనీ, గుంపులు గుంపులుగా రావని ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డిని పులిగా సంబోధించారు. ప్రభుత్వానికి ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి రెండు కళ్ళులాంటి వన్నారు. కష్టకాలంలోనూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా వైకాపా ప్రభుత్వం పారదర్శక పాలన అందించిందన్నారు. నిరంతర నిర్విరామంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలను అందిస్తున్నామన్నారు. దేశంతోపాటు ప్రపంచ దేశాలన్నీ రాష్ట్రంలో జరుగుతున్న సచివాలయాలు, ఆర్‌బికెల నిర్వహణపై అధ్యయనం చేస్తున్నారంటే వైకాపా పాలన ఏపాటిదో అర్థమవుతుందన్నారు. ఈ స్థాయిలో అభివృద్ధి, సంక్షేమ పథకాలందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డికి రాబోయే ఎన్నికల్లో అండగా నిలచి గతం కంటే గొప్ప విజయాన్ని అందించాలని పిలుపునిచ్చారు. స్థానికంగా సింగిల్‌విండో నూతన భవనానికి శంకుస్థాపన చేసారు. వైకాపా రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, జడ్పీ ఛేర్మన్ గోవిందప్ప, టిటిడి బోర్డు సభ్యుడు పోకల అశోక్, డిసిసిబి ఛేర్మన్ రెడ్డెమ్మ, ముడా ఛేర్మన్ వెంకట్రెడ్డియాదవ్, డిఆర్‌డీఏ పిడి తులసి, జడ్పీటీసీ నడింపల్లి దామోధర్‌రాజు, యువకాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు మిద్దింటి కిషోర్, బోయకొండ, సింగిల్‌విండో, ఆరోగ్యకేంద్ర అభివృద్ధి ఛేర్మన్లు మిద్దింటి శంకరనారాయణ, రవిచంద్రారెడ్డి, కళ్యాణ్‌భరత్, సర్పంచు భరత్‌వరుణ్, నియోజకవర్గం వైకాపా నాయకులు, కార్యకర్తలు,మహిళలు పాల్గొన్నారు.

### చంద్రబాబు,పవన్‌లవి మాటలు..జగన్‌వి చేతలు : పెద్దిరెడ్డి



పుంగనూరు, అక్టోబరు 21 ప్రభాతవార్త : చంద్రబాబు, పవన్‌లవి మాటలతో జనాన్ని గారడీచేసే పనులని, తమనేత సిఎం జగన్ అభివృద్ధి కార్యక్రమాలను చేతలలో చూపించే మార్గదర్శకుడని రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన పట్టణంలని ఐటిఐ కళాశాలలో నియోజక వర్గ స్కిల్ హబ్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ బాబొస్తే జాబొస్తుందని చెప్పిన చంద్రబాబు ప్రజలను మోసగించారని, అదే రీతిలో పవన్ మాటల గారడీతో యువతను మభ్యపెడుతున్నారన్నారు. జిల్లాలో కుప్పం, పలమనేరు, పుంగనూరు ప్రాంతాలలో యువతకు ఉపాధికల్పించే స్కిల్‌హబ్‌లను ఏర్పాటుచేసి వాటి ద్వారా శిక్షణలను అందించే కోర్సులను ప్రారంభిస్తు న్నామన్నారు. ఇదివరకే కుప ్పంలో హబ్ ఏర్పాటయిందని, ఇపుడు పట్టణంలో మూడేళ్ళఎలక్ట్రీషియన్ కోర్సు ద్వారా పట్టాను అందచేస్తామన్నారు. ఇంకా పలు శిక్షణాల కోర్సులను కూడా అందుబాటులోనికి తీసుకువచ్చి నిరుద్యోగులకు బాసటగా నిలుస్తామన్నారు. వీటితో యువత ప్రభుత్వ,ప్రైవేట్ రంగాలలో ఉద్యోగాలు సాధించవచ్చున్నారు. కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ వెంకటేశ్వర్లు, తితిదే సభ్యుడు పోకల అశోక్‌కుమార్,ఎన్ఆర్ఇజిఎస్ రాష్ట్రసభ్యుడు ముత్తంశెట్టి విశ్వనాథ్, రాష్ట్రజానపదకళల అకాడమీ ఛైర్మన్ కొండవీటి,పిఎంకే ఉడా ఛైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, జడ్పీఛైర్మన్ శ్రీనివాసులు,డిసిసిబి ఛైర్మన్ రెడ్డెమ్మ,వైకాపా రాష్ట్ర కార్యదర్శులు పెద్దిరెడ్డి,బైరెడ్డిపల్లి కృష్ణమూర్తి,ఎంపిపి అక్కిసాని భాస్కరరెడ్డి, ఛైర్మన్ అలీంబాషా, ఆర్టీసి యూనియన్ అధ్యక్షుడు జయరామిరెడ్డి,ఏఎంసి ఛైర్మన్ నాగరాజరెడ్డిలతో, జిల్లా స్కిల్‌డెవలప్‌మెంట్ అధికారి గుణశేఖర్‌రెడ్డి, పుంగనూరు ప్రిన్సిపాల్ శేషారెడ్డి,జడ్పిటిసి జ్ఞాన ప్రసన్నచంద్రారెడ్డి, ఎంపిడిఓ రామనాథరెడ్డి,వైస్ ఎంపిపి రమణాఈశ్వరమ్మ,వైకాపా నాయకులు రాజశేఖర్‌రెడ్డి, చెంగారెడ్డి, కుమ్మరనత్తం సర్పంచ్ భాగ్యరేఖ పాటూ కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, పార్టీనాయకులు,ప్రజలు పాల్గొన్నారు.



తిరుమలలో ఎలక్ట్రికల్ బస్సులను ప్రారంభిస్తున్న చైర్మన్, ఇఓ -ప్రభాతవార్త తిరుమల



టిటిడి విద్యాసంస్థలకు హెచ్‌వైఎం లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు ప్రధానం చేస్తున్న జెఇఓ సదాభార్గవి



టిటిడి విద్యాసంస్థల శాఖాధికారిగా బాధ్యతలు స్వీకరిస్తున్న భాస్కర్‌రెడ్డి -ప్రభాతవార్త తిరుమల

## కనకదుర్గను దర్శించుకొన్న ఎమ్మెల్యే ఆరణి

చిత్తూరు, అక్టోబర్ 21 ప్రభాతవార్త:



చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు శుక్రవారం విజయవాడలోని కనకదుర్గ ఆలయంలోని దుర్గాదే విని దర్శించుకొన్నారు. ఈసందర్భంగాఆలయ అర్చకులు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును ఆశీర్వదించి ఆలయ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుర్గమ్మను ఎమ్మెల్యేతో పాటు కలిసి దర్శించుకొన్న వారిలో చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి, రాష్ట్ర డైరెక్టర్ జ్ఞానప్రకాష్, చిత్తూరు రూరల్ మండల వైకాపా అధ్యక్షుడు త్యాగరాజులు, వైకాపా నాయకులు మనోహర్‌రెడ్డి, శివ, కుమార్, దేవరాజులు తదితరులు వున్నారు.

## రూ.3.50 లక్షలతో వెటర్నరీ అసిస్టెంట్ టోకరా!

పూతలపట్టు, అక్టోబర్ 21 ప్రభాతవార్త:

పాడి రైతులకు సబ్సిడీ రుణాలు ఇప్పిస్తానని చెప్పి పూతలపట్టు వెటర్నరీ ఆసుపత్రిలో లైవ్‌స్టాక్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న మహబూబ్‌భాషా రైతుల నుండి వసూలు చేసిన 3.50 లక్షల రూపాయలతో ఉడాయించాడు. వెటర్నరీ ఆసుపత్రిలో లైవ్‌స్టాక్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తుండటంతో మహబూబ్‌భాషను స్థానిక పాడి రైతులు నమ్మకం పెట్టారు. ఈ నమ్మకంను ఆసరాగా చేసుకొన్న మహబూబ్‌భాష తాను సబ్సిడీ రుణాలు ఇప్పిస్తానని రైతులను నమ్మించి వారి నుండి భారీగా డబ్బులు వసూళ్ళు చేశాడు. సుమారు 15 మంది రైతులు మహబూబ్ భాషాపై నమ్మకంతో 3.5 లక్షల రూపాయల మేరకు ఇచ్చారు. అయితే రైతులకు సబ్సిడీ రుణాలు మంజూరు కాకపోవడంతో అతనిని పలుమార్లు ప్రశ్నించారు. దీనిపై సరైన సమాధానం చెప్పకుండా మహబూబ్‌భాషా సబ్సిడీ రుణాల విషయంను దాట వేస్తూ వచ్చాడు. ఈ క్రమంలో ఒక్కసారిగా పూతలపట్టు వెటర్నరీ ఆసుపత్రి నుండి మహబూబ్ భాషా బదిలీ అయి వెళ్ళిపోవడంతో సబ్సిడీ రైతుల కోసం అతనికి డబ్బులు చెల్లించిన రైతులు ఖంగుతిన్నారు. ఈ విషయంపై రైతులు వెటర్నరీ డాక్టర్ సుధారాణిని కలిసి తమకు మహబూబ్‌భాషా చేసిన అన్యాయంను వివరించారు. ఈ విషయంపై ఆమె రైతులతో మాట్లాడుతూ న్యాయం జరిగేలా చర్యలు తీసుకొంటానని హామీ ఇచ్చారు.

## మాకు కొండంత అండగా వైఎస్సార్ దీవెనలు : పెద్దిరెడ్డి

పుంగనూరు, అక్టోబరు 21 ప్రభాతవార్త :

రాష్ట్రప్రజలకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్, నేటి సిఎం జగన్ ఇద్దరు రెండు కళ్ళలాంటివారని, నేటికీ రాష్ట్రప్రజల గుండెల్లో వైఎస్సార్ కొలువున్నారని, అలాంటి నేత దీవెనలే తమ పార్టీకు కొండంత అండగా నిలుస్తాయని రాష్ట్రమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. ఆయన శుక్రవారం నియోజకవర్గంలో పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈసందర్భంగా పట్టణంలో జరిగిన చేయూత కార్యక్రమాన్ని వైఎస్సార్ చిత్రపటానికి అంజలిఘటించి ప్రారంభించారు. ప్రజలు ముఖ్యమంత్రికి తోడుగా నిలవాలని, ఆయనకు మద్దతుగానిలవాలని కోరారు.

## రాష్ట్ర 'దేశం' అధ్యక్షుడిని కలిసిన షణ్ముగం

చిత్తూరు, అక్టోబర్ 21 ప్రభాతవార్త:



రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు అచ్చెమనాయుడు, రాష్ట్ర పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు టిడి జనార్ధన్‌లను శుక్రవారం మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో రాష్ట్ర తెలుగదేశం బిసీ సెల్ ప్రధాన కార్యదర్శి షణ్ముగం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా షణ్ముగం రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు అచ్చెమనాయుడు, పొలిట్‌బ్యూరో సభ్యులు టిడి జనార్ధన్‌లను సన్మానించారు.

## మూడు రాజధానులతో అన్ని ప్రాంతాలు అభివృద్ధి : జడ్పీ చైర్మన్

గుడిపాల, అక్టోబర్ 21 ప్రభాతవార్త:



మూడు రాజధానులతోనే రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని జడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ విజయానందరెడ్డిలు పేర్కొన్నారు. గుడిపాలమండలంచిత్తపారనుండి శుక్రవారం జగన్ సేవాదళ్ అధ్యక్షుడు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో మూడు రాజధానులకు మద్దతుగా తిరుమలకు పాదయాత్ర చేపట్టారు. ఈ పాదయాత్రలో పాల్గొని జడ్పీ చైర్మన్ గోవింద ప్ప శ్రీనివాసులు, ఆర్టీసీవైస్‌ఛైర్మన్ విజయానందరెడ్డి, జడ్పీవైస్ ఛైర్మన్ రమ్యలు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా జడ్పీ ఛైర్మన్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధిని దృష్టిలో వుంచుకొని సిఎంవైఎస్ జగన్మోహన్‌రెడ్డి మూడురాజధానులుఏర్పాటు చేయాలని నిర్ణయించారన్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు గోళ్ళ హరిప్రసాద్, నారాయణమూర్తి, గోపి, జగన్ సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

## చైర్మన్, ఆర్టీసీ వైఎస్ చైర్మన్లు.

బంగారుపాళ్యం, అక్టోబర్ 21 ప్రభాతవార్త:

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంను శుక్రవారం ఎంపిపి అమరావతమ్మ ప్రారంభించారు. బలిజపల్లిసమీపంజాతీయరహదారిపై104వాహనంలోచేపట్టినఫ్యామిలీ డాక్టర్ నిర్వహించారు. సిహెచ్ఓషమీమ్, ఎంపిటిసీశ్యామల, ఎంపిహెచ్ఓబృహస్పతి, సూపర్‌వైజర్ హరికృష్ణ, ఎంఎల్‌హెచ్‌పిలు కుమారి, రవళి, శ్రావణి, పునీత్, పలువురు ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

## పేదరిక నిర్మూల కోసమే సంక్షేమ పథకాలు : మంత్రి పెద్దిరెడ్డి

కల్లూరు, అక్టోబరు 21 ప్రభాతవార్త :



పేదరిక నిర్మూలనే పరమావధిగా సంక్షేమ పథకాలు అమలు చేయడం జరుగుతోందని రాష్ట్ర విద్యుత్ అటవీపర్యావరణశాఖమంత్రిపెద్దిరెడ్డిరామ చంద్రారెడ్డి అన్నారు. శుక్రవారంసదుం, పులిచెర్ల, రొంపిచెర్ల మండలా లకు సంబంధించి వైఎస్సార్ చేయూత మూడో విడత లబ్దిదారులకు మెగా చెక్కు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈసమావేశంలో జాతీయ స్థాయిలో ఉత్తమ పంచాయతీగా ఎన్నికైన మంగళంపేట సర్పంచి మధును మంత్రి అభినందించి సన్మానించారు. ఉత్తమ ఎంఈఓగా సోమల, ఉత్తమ ఎస్‌హెచ్‌జీ శ్రీవెంకటేశ్వర గ్రూప్, వి.ఓ3 చౌడేపల్లె, ఉత్తమ వీవోగా రొంపిచెర్ల మండలం గానుగ చింతలకు మంత్రి అవార్డులు, మెమోంటోలు అందజేశారు. స్టాల్సలో ఉత్తమ మిల్లెట్ అవార్డును నూర్జహాన్‌కు అందించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్, జడ్పీచైర్మెన్ శ్రీనివాసులు, డీఆర్‌డీఏ పీడీ తులసి, ఆర్‌డీఓ రేణుక, జడ్పీ సీఈఓప్రభాకర్‌రెడ్డి, డీపీఓ లక్ష్మి, తితిదే బోర్డు సభ్యులు పోకల అశోక్‌కుమార్, మూడు మండలాలకు చెందిన అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, వైకాపా నాయకులు పాల్గొన్నారు.

## కలుషిత నీటితో కలకలం

పెద్దపంజాణి అక్టోబర్ 21 ప్రభాతవార్త :



పెద్దపంజాణి మండలంలోని చలమంగళం పంచాయతీ కేంద్రంలో కలుషిత నీటితో ప్రజల్లో కలకలం వ్యక్తమౌతోంది. అంగన్‌వాడి, ఓ ఆలయం సమీపంలో గ్రామంలో ప్రజల త్రాగునీటి పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన త్రాగునీటి పైపులైన్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు వర్షపునీరు, మురుగునీరు ఆ త్రాగునీటి పైపులైన్లలలో కలవడం జరుగుతోంది. అధికారులు స్పందించి పైపులైన్లను మర్మతులు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు.

పెద్దపంజాణి అక్టోబర్ 21 ప్రభాతవార్త :



నియోజకవర్గస్థాయి పోటీలకు రాజుపల్లె జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులుఎంపికైనట్లుపాఠశాలప్రధానోపాధ్యాయులు ఎ.గౌరి శంకర్ శుక్రవారం తెలిపారు. ఈ మేరకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పిఇటి ఉపాధ్యా యురాలు ప్రసన్న, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే

ఐరాల, అక్టోబర్ 21 ప్రభాతవార్త:



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు పూతలపట్టు ఎమ్మెల్యే ఎం.ఎస్.బాబు అన్నారు. శుక్రవారం మండల వైకాపా కన్వీనర్ బుజ్జిరెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని పుత్రమద్ది గ్రామ సచివాలయ పరిధిలోని పుత్రమద్ది, పెండ్లిగుండ్లపల్లె తదితర గ్రామాలలో మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలసి ఎమ్మెల్యే గడప గడపకు-మన ప్రభుత్వం కార్యక్రమంను నిర్వహించారు. ఎంపీపీ చింతం మోహన్, ఎంపీడీఓ నిర్మలాదేవి, తహశీల్దార్ సుశీల, మండల వైకాపా కన్వీనర్ బుజ్జిరెడ్డి, వైస్ ఎంపీపీ నిత్య, నాయకులు చలపతిరెడ్డి, గణేష్ ప్రసాద్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, శాంతిసాగర్‌రెడ్డిలతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి శ్రీకారం

పూతలపట్టు, అక్టోబర్ 21 ప్రభాతవార్త:



పూతలపట్టు మండలం బైటపల్లి సచివాలయం పరిధిలోని మద్దయ్యగారిపల్లి గ్రామంలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంను ఎంపిడిఓ గౌరి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ గౌరి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకొని ఆరోగ్య సమాజ ఆవిష్కరణకు నడుం బిగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తహసిల్దారు విజయభాస్కర్, మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ ప్రియాంక, డాక్టర్ ప్రవీణ, 104 వైద్యురాలు డాక్టర్ లక్ష్మీప్రసన్న, సర్పంచ్ రామతులసి, సింగిల్‌విండో అధ్యక్షుడు దొరస్వామిరెడ్డి, వైస్ఎంపిపి చంద్రారెడ్డి, ఎంపిటీసీ పెద్దరెడ్డి, సిహెచ్ఓ శ్రీనివాసమూర్తి, హెచ్ఎస్‌లు శేషాద్రి, నూర్జహాన్‌లు, ఎఎన్ఎం సురేఖ, ఎంఎల్‌హెచ్‌పి వినేశా, ఆశా వర్కర్లు ధరణి, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## చిత్తూరు జిల్లాలోని డిఎస్ఏ బ్యాడ్మింటన్ కోర్టులు లీజుకు!

చిత్తూరురూరల్, అక్టోబరు 21 ప్రభాతవార్త:

చిత్తూరు జిల్లాలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వారి 4 బ్యాడ్మింటన్ కోర్టులను లీజుకు ఇవ్వడానికి శాప్ ప్రధాన కార్యాలయం విజయవాడలో నవంబర్ 12న బహిరంగ టెండర్ వేలం నిర్వహిస్తున్నట్లు సిఈవో మురళీక్రిష్ణ తెలిపారు. బహిరంగ వేలంలో పాల్గొనే వ్యక్తి శాప్ అధికారిక వెబ్‌సైట్ https://www.sports.ap.gov.in నుంచి ధరఖాస్తు ఫారంను డౌన్‌లోడ్ చేసుకోవాలని పేర్కొన్నారు. సెక్యూరిటీ డిపాజిట్‌గా రూ.10,000ల డిడిని వైస్‌చైర్మెన్, మేనేజింగ్ డైరెక్టర్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, విజయవాడ జాతీయబ్యాంకు నుండి మాత్రమే తీసుకొని, డిడి స్కాన్ కాపీతో మెయిల్ ఐడి saap.coaches@gmail.com కి నవంబర్ 10వ తేదిలోపు ధరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 0866- 2499699ను సంప్రదించాలని కోరారు.

## ఈ రోడ్డును బాగు చేయండి సార్!

బంగారుపాళ్యం, అక్టోబర్ 21 ప్రభాతవార్త:



నల్లంగాడు-తుంపాయనపల్లి లింక్ రోడ్డును బాగు చేయాలని శెట్టేరి తదితరగ్రామస్తులుకోరుతున్నారు. 2003 సంవత్సరంలో నాబార్డు నిధులతోఈరోడ్డులింక్‌రోడ్డుపనులు చేపట్టి పూర్తి చేశారు. ప్రస్తుతం ఈరోడ్డుఅధ్వాన్న స్థితికి చేరుకొంది. ఈ లింక్ రోడ్డు తుంబపాళ్యం, తుంబకుప్పం, నల్లంగాడు, శెట్టేరి, తుంపాయనపల్లిమీదుగా చిత్తూరుకు వెళ్ళడానికి ఎంతో ఉపయోగకరంగా వుంది. ఈ లింక్ రోడ్డు పనులను పూర్తి చేయాలని పరిసర గ్రామస్తులు కోరుతున్నారు.

## ఫ్యామిలీ డాక్టర్ విధానానం ఘనత సీఎందే : మంత్రి పెద్దిరెడ్డి

కల్లూరు, అక్టోబరు 21 ప్రభాతవార్త :



దేశంలోఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని తీసుకు వచ్చిన ఘనత రాష్ట్ర ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని రాష్ట్ర విద్యుత్ అటవీ పర్యావరణశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన పులిచెర్ల మండలం మంగళంపేట డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లో ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని జిల్లాలో లాంచనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్, జడ్పీ చైర్మెన్ గోవిందప్ప శ్రీనివాసులు, రాష్ట్ర పాల ఏకిరి కార్పొరేషన్ చైర్మెన్ మురళీధర్, డీఎంఅండ్‌హెచ్ఓశ్రీహరి, వైకాపారాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, ఎంపీపీ సురేంద్రనాథ్‌రెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, అటవీశాఖమాజీడైరెక్టర్‌రాజారెడ్డి, మండలస్థాయిఅధికారులు, వైకాపా నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

## అమర వీరులకు ఘన నివాళి

రొంపిచెర్ల, అక్టోబరు 21 ప్రభాతవార్త :



మండల కేంద్రమైన రొంపిచెర్లలో పోలీసులు శుక్రవారం అమర వీరులకు ఘనంగా నివాళులు అర్పించారు. దేశం కోసం దేశ సరిహద్దులో ప్రాణాలుఅర్పించిన అమర వీరులకు గుర్తుగా గ్రామంలోర్యాలీ నిర్వహించారు. ఎస్ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో మానవ హారం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ఏఎస్ఐ మధు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఫ్యామిలీ డాక్టర్‌కార్యక్రమం ప్రారంభం

రొంపిచెర్ల, అక్టోబరు 21 ప్రభాతవార్త :



మండల పరిధిలోని రొంపిచెర్ల-2లోని డాక్టర్ వైఎస్సార్ విలేజ్‌హెల్త్ క్లినిక్‌లో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కానె ్స్ప్ట్ కార్యక్రమాన్ని ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తంరెడ్డి జడ్పీటీసీ రెడ్డీశ్వరరెడ్డిలు ప్రారంభించారు. కార్యక్రమంలోపీహెచ్‌సీ వైద్యులు రాజా, జయశ్రీ, 104 డాక్టర్ ముఖేష్ నాయక్, మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి సిబ్బంది పాల్గొన్నారు.

## గణనాథుని సేవలో కర్నాటక మంత్రి

కాణిపాకం, అక్టోబర్ 21 ప్రభాతవార్త:

కర్నాటక రాష్ట్ర సహకార శాఖ మంత్రి సోమశేఖర్ కుటుంబసమేతంగా శుక్రవారం కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామివారిని దర్శించుకున్నారు. వారికి వేదమండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి ప్రసాదాలను, శేషవస్త్రాలను, చిత్రపటాన్ని అందజేశారు. వారి వెంట ఆలయ సూపరెండెంట్ కోదండపాణి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## కనమర్లపూడికి శుభాకాంక్షలు తెలిపిన వైసీపీ నేతలు

నాయుడుపేట, అక్టోబర్ 21 ప్రభాతవార్త :



ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు కనమర్లపూడి సుబ్రహ్మణ్యం జన్మదినం సందర్భంగా శుక్రవారం మండల వైసీపీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. వైసీపీ నాయకులు కామిరెడ్డి రాజారెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ వెంకటకృష్ణారెడ్డి, కౌన్సిలర్లు దారా రవి, మోహన్, చంద్రారెడ్డి, యతేంద్ర తదితరులు కనమర్లపూడి సుబ్రహ్మణ్యంను పూలమాలలు, బొకేలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## నాయుడుపేటలో పోలీసుల ర్యాలీ

నాయుడుపేట, అక్టోబర్ 21 ప్రభాతవార్త :



పోలీసు అమర వీరుల సంస్మరణ దినం సందర్భంగా శుక్రవారం నాయుడుపేటలో పోలీసులు ర్యాలీ నిర్వహించారు. గురుకుల పాఠశాల విద్యార్థులతో కలిసి గాంధీమందిరం నుంచి అంబేడ్కర్ విగ్రహంవరకు ర్యాలీ కొనసాగింది. ఈ ర్యాలీలో పోలీసుఅమర వీరులను స్మరించుకుంటూ నినాదాలు చేశారు. ఎస్ఐ కృష్ణయ్య, కానిస్టేబుళ్ల గురుకుల పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## అమరుల త్యాగం..స్మరించుకుందాం

కోట, అక్టోబర్ 21 ప్రభాతవార్త :



విధి నిర్వహణలో ఆశువులు బాసినపోలీసు అమరులు త్యాగాలు, సేవలు మరువులేనివని, అమరులైన పోలీసులకు నివాళి అర్పిస్తూ అక్టోబర్ 21 న అమర వీరుల దినోత్స వంగా నిర్వహించుకొవడం జరుగుతోందనిఎస్ఐ.జి.పుల్లారావు పేర్కొన్నారు. శుక్రవారం కోటలోని బిసి గురుకుల విద్యార్థులతో అమరవీరుల త్యాగాన్ని స్మరిస్తూ ప్రదర్శన నిర్వహించారు. 24 గంటల ప్రజల ధన, మాన ప్రాణాలకు కాపాడేందుకు తమ జీవితాలను సైతం పణంగా పెట్టి సేవలందిస్తున్నామని అన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలొదిన వారి సేవలను స్మరించుకొంటూ అమర వీరుల సంస్మరణ దినోత్సవం జరుపుకొడం జరుగుతోందన్నారు. అనంతరం కోట క్రాస్ రోడ్డులో విద్యార్థులు మానహారం చేశారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుళ్లు, కృష్ణమూర్తి, వెంకటేశ్వర్లు. తదితరులు పాల్గొన్నారు.

## మేము ఇష్టపడి పేళ్లి చేసుకొన్నాం!

కోట, అక్టోబర్ 21 ప్రభాతవార్త :

మేము ఇద్దరం మేజర్లం ఇష్టపడి ప్రేమించి పెళ్లి చేసుకున్నామం. మాకుపోలీసులురక్షణ కల్పించాలని ఒ ప్రేమజంట పోలీసులను ఆశ్రయించింది. ఇటివల కోటమండలంకర్లపూడిగ్రామానికిచెందిన ఒ యువతి అదృశ్యమైనట్లుఆయువతికుటుంబీకులు కోట పోలీస్ స్టేషన్‌లోపిర్యాదు చేశారు. ఆమేరకు కేసు నమోదు చేసినపోలీసులుఆయువతినిదర్యాప్తుచేసి తీసుకొచ్చా రు. ఆయువతి. తాముమేజర్లమనిపేళ్లిచేసుకొన్నా మని పోలీసు లుకు వివరించారు. సూరిశేట్టిపాళెం గ్రామంచెందినయువకుడు. పోలీసులుఇద్దరికి కౌన్సిలింగ్ ఇచ్చే దిశగా చర్యలు చేపట్టారు.

## రాజ్యాంగాన్ని మార్చేందుకు బిజెపి కుట్ర - విసికె పార్టీ రాష్ట్ర నేత పిటిఎం శివప్రసాద్

కుప్పం, అక్టోబర్ 21 ప్రభాతవార్త



కులమతాలకు అతీతంగా ఉన్న భారతదేశంలో అత్యున్నత రాజ్యాంగాన్ని మార్చేందుకు బిజెపి ప్రభుత్వం కుట్రలు చేస్తోందని విడుదలై చిరుతగల్ కచ్చి (విసికె ) పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిటిఎం శివప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం కుప్పంలో పర్యటించిన అనంతరం నేతల సమావేశంలో మాట్లాడారు. మోడీ సర్కారు దేశాన్ని నాశనం చేస్తోందన్నారు. కులం, మతం, దేవుడి పేరిట ప్రజలమధ్య చిచ్చు పెడుతోందన్నారు. కార్పోరేట్లకు దేశ సంపద దోచి పెడుతోందని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీలను బ్రాహ్మణ, వైశ్య, క్షత్రియులకు బానిసలుగా మార్చాలని చూస్తోందన్నారు. ప్రజలు ఈ చర్యలను ఖండించాలన్నారు. విభజన హామీలు తుంగలో తొక్కిన భాజపాతో వైకాపా, ప్రతిపక్ష తెదేపా, జనసేన అంటకాగుతున్నాయని ఇవి బిజెపితో తెగతెంపులు చేసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాయలసీమ కో ఆర్డినేటర్ యు. గణపతి, బాస్ జిల్లా కన్వీనర్ బాలచంద్రబాబు, అన్నమయ్య జిల్లా కన్వీనర్ ముత్యాల మోహన్, నేతలు మనోహర్‌రెడ్డి, కుమార్, గోవిందప్ప, బాలకృష్ణ, వినోద్‌కుమార్, నారాయణ, నవీన్ పాల్గొన్నారు.

## ఇంటర్నల్ రోడ్ల కోసం గడప గడపలో వినతి

తడ, అక్టోబర్ 21 ప్రభాతవార్త :



తడ పంచాయతీ పరిధిలో శుక్రవారం సూళ్లూరుపేట ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యులు కిలివేటి సంజీవయ్యగడపగడపకుమనప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. గురువారం రాత్రి వర్షం కురిసిన కారణంగా తడలోని కొన్ని ఇంటర్నల్ రోడ్లపై వాననీరుచేరింది. స్థానికులు ఇంటర్నల్ రోడ్లు బాగు చేయాలని ఎమ్మెల్యేకి ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ప్రతి ఇంటికి అందుతున్న లబ్ధిని ఆయన వివరించారు. కార్యక్రమంలోమండలాధ్యక్షుడు కె.రఘురెడ్డి, సర్పంచ్‌కె. ఆర్ముగం, మాజీఏఎంసీ ఛైర్మన్ వెంకటకృష్ణారెడ్డి, డీసీఎంఎస్‌డైరెక్టర్ సురేష్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు వెంకటేష్, జాలర్ల సంఘం నాయకులు కోదండం, వైసీపీ నాయకులు శేఖర్ బాబు, రాజ్‌కుమార్, జయకుమార్, రవిరెడ్డి, మురుగన్, రత్నం, మమేశ్వర్, పలువురు అధికారులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

## పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

శాంతిపురం, అక్టోబర్ 21 ప్రభాతవార్త :

పట్టభద్రులైన ప్రతి ఒక్కరూ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటర్లుగా నమోదు చేసుకోవాలని జిల్లా బిజెపి అధ్యక్షుడు మైందల రామచంద్రుడు కోరారు. శుక్రవారం శాంతిపురంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు కాశీనాథ్, కుప్పం నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జ్ రాజసి ంహ, కుప్పం, గుడుపల్లె, రామకుప్పంఅధ్యక్షులువడివేలు, రామచంద్ర, అమర నారాయణరెడ్డి పాల్గొన్నారు.

## తాలుకా ఎన్జీఓ సంఘ అధ్యక్షుడిగా దుర్గాప్రసాద్

బంగారుపాళ్యం, అక్టోబర్ 21 ప్రభాతవార్త:



స్థానిక పశువైద్య శాల ఆవరణలో శుక్రవారం సాయంత్రం బంగారుపాళ్యం తాలుకా నూతన ఎన్జీఓ సం ఘ కార్యవర్గం ఎన్నికైంది. తాలుకా ఎన్జీఓ సంఘ అధ్యక్షుడిగా తగ్గువారిపల్లి గ్రామ కార్యదర్శి దుర్గాప్రసాద్ ఎన్నికయ్యారు. అలాగే గౌరవ అధ్యక్షులుగా ఉమాపతి, ఉపాధ్యక్షులుగా సాదరయ్య, నాగేంద్రనాయక్, రామచంద్రయ్యలు, ప్రధాన కార్యదర్శిగా జ్యోతీశ్వరరెడ్డి, సంయుక్తకార్యదర్శులుగాశేఖర్, జ్యోతినాథ్, వాణి, వినాయకం, పలువురుసభ్యులుఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## బంగారం దుకాణాలపై డిఎస్పీ దాడులు

కుప్పం, అక్టోబర్ 21 ప్రభాతవార్త :



కుప్పం, శాంతిపురంలలోని పలు బంగారు నగల దుకాణాలపై శుక్రవారం తూనికలు, కొలతల శాఖ గూడూరు డిఎస్పీ సుధాకర్ దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా పలు దుకాణాలకు జరిమానాలు విధించారు. కుప్పం పట్టణంలోని మంగళ్ జ్యూవెలర్స్‌లో తనిఖీలు చేపట్టి రికార్డులు సక్రమంగా లేని కారణంగా లక్ష రూపాయల దాకా జరిమానా విధించారని సమాచారం. ఇక్కడ బంగారం, వెండి తూకాల్లో తేడాలు రావడంతో మిషన్‌ను సీజ్ చేశారు. అలాగే కృష్ణా జ్యూవెలర్స్‌లో సైతం తనిఖీలు చేపట్టారు. బంగారునగలదుకాణాల్లో తనిఖీలు, దాడులపై జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందించడం జరుగుతుం దన్నారు.

## లయన్స్ క్లబ్‌చే క్లీన్ ఇండియా కార్యక్రమం

కుప్పంరూరల్, అక్టోబర్ 21 ప్రభాతవార్త :



కుప్పం లయన్స్‌క్లబ్ అధ్వర్యంలో శుక్రవారం గుడివంక ఆలయం వద్ద క్లీన్ ఇండియా కార్యక్రమంను చేపట్టినట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ మహేష్ తెలిపారు. ఈ కార్యక్రమంకు అతిథులుగా కోలారు లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ రవీంద్రనాథ్, అడ్మినిస్ట్రేటర్ పిజి సెల్వం, కోశాధికారి సెంధిల్‌కుమార్, సభ్యులు సురేష్, లెనిన్, హెల్పింగ్ హ్యాండ్ సభ్యులు సుబ్బు, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## టపాకాయల దుకాణాలు ప్రారంభించిన ఎమ్మెల్సీ భరత్

కుప్పం, అక్టోబర్ 21 ప్రభాతవార్త :



దీపావళి పండగ సందర్భంగా కుప్పం బైపాస్ రోడ్‌లో ఏర్పాటుచేసినటపాకాయలదుకాణాలనుశుక్రవారం చిత్తూరు ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు కెఆర్‌జె భరత్ ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్, కౌన్సిలర్ సోమశేఖర్, టెలికాం బోర్డు సభ్యుడు వెంకటేష్, రెస్కో డైరెక్టర్ కుట్టి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మీలాద్ - ఎ- నబి వేడుకలు

కుప్పం, అక్టోబర్ 21 ప్రభాతవార్త :



స్థానిక పాతపేట మసీదులో మీలాద్ - ఎ- నబి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చిత్తూరు ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు కెఆర్‌జె భరత్, రెస్కో ఛైర్మన్ సెంధిల్ కుమార్ హాజరయ్యారు. మత పెద్దలు మహ్మద్ ప్రవక్త స ందేశాన్ని విన్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. శుక్రవారం మధ్యాహ్నం మసీదులో పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సయ్యద్ అలీ, బాట్లీ, ఎఎం అలీ, ఫైరోజ్, అలీం బాషా, సలీం తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ పథకాలు అందేలా చూడాలి : ఎమ్మెల్సీ

రామకుప్పం, అక్టోబర్ 21 ప్రభాతవార్త :



మండలంలో అర్హులైన పేదలకు ప్రభుత్వ పథకాలు అందేలా ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టాలని చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ ఆదేశించారు. శుక్రవారం మండల కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో ఎంపిపిసుబ్రమణ్యం, జడ్పీటిసి నితిన్‌రెడ్డి, మండల కన్వీనర్ బాబురెడ్డి, కోకన్వీనర్ చంద్రారెడ్డి, కో ఆప్షన్ బర్కతుల్లా, సర్పంచులు బివి మురళి, సికందర్, రాంబాబురెడ్డి, రాజగోపాల్, నేతలు సుగుణప్ప, కేశవరెడ్డి, నారాయణస్వామి, ఎంపిటిసి వెంకటరామిగౌడు, చలపతి, నాగిరెడ్డి, ఎంపిడిఓ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మామిడిలో అంతర పంటల సాగుతో అదనపు ఆదాయం

వెదురుకుప్పం, అక్టోబర్ 21 ప్రభాతవార్త :



మామిడిలో అంతర పంటలు సాగుచేయడం వలన రైతులకు అదనపు ఆదాయం సమకూరుతుందని తిరుపతి రాస్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని ఇనాం కొత్తూరు, దామరకుప్పంలలో శుక్రవారం మామిడిలో అంతరపంటల సాగు పై రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలిక ఉద్యానవన పంటలలో అంతర పంటలుగా పూలు, కూరగా యాలు, పచ్చి రొట్టి పంటలు సాగుచేయడం వలన కలుపు సమస్య తగ్గటమే కాకుండా అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. ప్రభుత్వం అందిజేస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకుని రైతులు ప్రయోజనం పొందాలని చూచించారు. ఈ కార్య క్రమంలో శాస్త్రవేత్తలు నాగరాజు, ముకుందలక్ష్మీ, రాజశేఖర్, చీనీనిమ్మపరిశోధనాస్థానంతిరుపతిజిల్లా ఉద్యాన అధికారి మధుసూధన్ రెడ్డి, మండలఉద్యానవనఅధికారిహరిక్రిష్ణరెడ్డి, వ్యవసాయ విద్యార్థులు, రైతులు పెద్ద సంఖ్యలోపాల్గొన్నారు.

## చదువుతో పాటు క్రీడలు అవసరమే : ఎంపీపీ

సత్యవేడు, అక్టోబర్ 20 ప్రభాతవార్త :

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎంపీపీ ప్రతిమ అన్నారు. శుక్రవారం నియోజకవర్గకేంద్రమైన సత్యవేడులో ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలకు ఎంపీపీ ప్రతిమ, జడ్పీటీసీ విజయలక్ష్మిలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఎంపీపీ ప్రతిమ మాట్లాడుతూ విద్యార్థుల మానసికంగా ధృడంగా ఉండాలంటే క్రీడల్లో రాణించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈకార్యక్రమానికి ఎంఈవో రవి, దాసుకుప్పం ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి, వ్యాయామ ఉపాధ్యాయులు లోకనాథం, వెంకటేశులు, హేమకుమార్, వైకాపా నాయకులు బీరేంద్రవర్మ, నిరంజన్ రెడ్డి, బెల్టు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## పాతవారినే కొనసాగించండి..జిల్లా విద్యాశాఖ ఉత్తర్వులు జారీ

సత్యవేడు, అక్టోబర్ 21, ప్రభాతవార్త :

పాత వంట కార్మికులనే విధుల్లోకి తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంఈవో రవి ఒక ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈవో రవి మాట్లాడుతూ మండలపరిధిలోని దాసుకుప్పం జడ్పీఉన్నత పాఠశాలలో వంటకార్మికుల తొలగింపు, కొత్తవారి నియామకంలో ప్రధానోపాధ్యాయులు జ్యోతి దుందుడుకు చర్యలపై జరిగి రగడ అంతా మండల వాసులకు తెలిసిందే. దీంతో వంటకార్మికుల సమస్యకు నేటితో తెరపడిందన్నారు.

## ఎమ్మెల్సీఎన్నికల్లో ఓటరుగా నమోదు చేసుకోండి

చిత్తూరురూరల్, అక్టోబరు 21 ప్రభాతవార్త:

స్కూల్ అసిస్టెంట్లందరూ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరుగా నవంబర్ 7వ తేది లోపు నమోదు చేసుకోవాలని స్కూల్ అసిస్టెంట్ల రాష్ట్ర సంఘ అధ్యక్షుడు నరోత్తమరెడ్డి పిలుపునిచ్చారు. స్కూల్ అసిస్టెంట్ల సమస్యల సాధనకు మంచి వ్యక్తులను ఎన్నుకొనే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడానికి ఓటరుగా నమోదు చేసుకోవాలని నరోత్తమరెడ్డి కోరారు.

# మనం బతుకుతూ ఇతరులకు బతుకుదెరువు చూపాలి : రాజేష్‌రెడ్డి

## -యువతకు స్ఫూర్తి రొమ్మాల రాజేష్‌రెడ్డి





రేణిగుంట, అక్టోబరు 21 ప్రభాతవార్త: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలన్న దృఢ సంకల్పంతో ముందుకు దూసుక ఎపోతున్న యువనేత రొమ్మాల రాజేష్‌రెడ్డిని అందరూ అభినందిస్తున్నారు. సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ పేదలకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తున్నారు. రాజేష్‌రెడ్డి పుట్టిన రోజు ఆయనకు ఒక్కరికే కాదు ఆ గ్రామం అంతా పండగే. నిరుపేదలకు బట్టలు, స్వీట్ బాక్సుల పంపిణీ, అన్నదానాలు, అన్ని దగ్గరుండి జరిపిస్తారు. ఇంట్లో, హోటల్లో, ఫంక్షన్ హాలుల్లో కేక్ కట్ చేసుకుని పుట్టిన రోజు జరుపుకుంటే అది మన వరకే ఉంటుందని అందరి మధ్య జరుపుకుంటే వారి దీవెనలే తనకు శ్రీరామరక్షగా ఉంటాయన్నది రాజేష్‌రెడ్డి అభిప్రాయం. రేణిగుంట మండలం కొత్రమంగళం గ్రామానికి చెందిన రొమ్మాల రాజేష్‌రెడ్డి చిన్నప్పటి నుంచి తల్లిదండ్రులు రొమ్మాల లలితరెడ్డి, రొమ్మాల భాగ్యశేఖర్‌రెడ్డిల పెంపకం, క్రమశిక్షణ అయను యువ నాయకునిగా తీర్చిదిద్దాయి. ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. ముఖ్యంగా యువత చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా వారిని వివిధ రకాలైన ఆటల పట్ల ఆసక్తి పెరిగేలా క్రికెట్ తదితర కిట్లు అందజేసి క్రీడల పట్ల ఉన్న అభిమానాన్ని సమాజంలో పౌరునిగా తన ధర్మాన్ని చాటుకుంటున్నారు. ఈ మధ్య కాలంలో యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి తిరుపతి రూరల్ మండలం తనపల్లి క్రాస్ వద్ద అత్యాధునిక యంత్రాలతో సురేష్ ఫుడ్, బ్రేవరైజర్స్ యూనిట్‌ను ప్రారంభించారు. పార్టీలకతీతంగా పలువురు రాజకీయ ప్రముఖులు, అధికారులు, స్వచ్చంద సేవా సంస్థ ప్రతినిధులు ఆయన తీసుకున్న నిర్ణయాన్ని అభినందిస్తున్నారు. ఆయన ఏమన్నారో ఆయన మాటల్లోనే ప్రతి వ్యక్తిలోనూ అంతర్గతంగా ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుందన్నారు. ప్రతిభను వెలికి తీయడానికి సాధన చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. భగవంతుని దృష్టిలో అందరూ సమానులన్నారు. తారతమ్యం బేధాలు మనం సృష్టించుకున్నవేనన్నారు. యువకులు ముందుకు వచ్చి చిన్న చిన్న పరిశ్రమలు స్థాపించి ఎంతో మంది ఉద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని యువతకు పిలుపునిచ్చారు. ప్రజాసేవ చేయాలంటే ప్రజాప్రతినిధులు కావాల్సిన అవసరం లేదని ఏ విధంగానైనా ప్రజాసేవ చేయవచ్చుననే నమ్మకం తనకున్నదన్నారు. అందులో భాగమే తాను చేస్తున్న ప్రయత్నాలన్నారు. నిర్దిష్టమైన ప్రణాళికలతో అనుకున్న పనులను ఇష్టపడి చేస్తే అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చునని తెలిపారు. యువత రాజేష్‌రెడ్డిని మార్గదర్శిని చేసుకుని ఆయన బాటలో పయనిస్తే అనుకున్న ఫలితాలు అంతకు మించిన లాభాలు సాధిస్తారు అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

# దిగువమాఘంలో ఘనంగా రాజన్న వర్ధంతి వేడుకలు

తవణంపల్లె, అక్టోబర్ 21 ప్రభాతవార్త: రాష్ట్ర మాజీ మంత్రి గల్లా అరుణకుమారి తండ్రి, మాజీ ఎంపీ దివంగత పాటూరి రాజగోపాల్ నాయుడు (రాజన్న) 26వ వర్ధంతి వేడుకలను శుక్రవారం ఆయన స్వ గ్రామమైన దిగువమాఘంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. దిగువమాఘంలోని రాజన్న పార్క్ (అమరాగావ్)లో వర్ధంతి వేడుకలను నిర్వహించారు. ఈసందర్భంగా రాజగోపాల్‌నాయుడు కుమార్తె మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, అమరరాజీ బ్యాటరీస్ అధినేత గల్లా రామచంద్రనాయుడు దంపతులు, అమర ఆస్పత్రి అధినేత్రి డాక్టర్ రమాదేవి గౌరినేనిలు రాజన్న పార్క్‌లోని రాజగోపాల్‌నాయుడు కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ పేదల పక్షపాతి రాజగోపాల్‌నాయుడు అని కొనియాడారు. ఈసందర్భంగా కోలాటాలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు వేణుగోపాల్‌నాయుడు, స్థానిక సర్పంచ్ గోపీ, మాజీ సర్పంచ్ కుమార్‌నాయుడు, గ్రామస్థులు, గల్లా అభిమానులు పాల్గొన్నారు.

# ఎల్‌కెపి ఊరు మామిడితోపులో హత్య!

## - భార్యతో అక్రమ సంబంధం పెట్టుకొన్న వ్యక్తిని హత్య చేసిన భర్త

## - అర్ధగంటలో కేసును చేధించిన పెనుమూరు పోలీసులు

పెనుమూరు, అక్టోబర్ 21 ప్రభాతవార్త: భార్యతో అక్రమ సంబంధం పెట్టుకొన్న వ్యక్తిని భార్త కడతేర్చిన సంఘటన పెనుమూరు మండలంలో శుక్రవారం చోటు చేసుకొంది. పెనుమూరు మండలం ఎల్‌కెపి ఊరు సమీపంలోని ధనంజయ నాయుడు మామిడి తోటలోని ఒక చెట్టు కింద ఓ వ్యక్తిని హత్య చేసి వుండటం చూసిన స్థానికులు చూసి పోలీసులకు సమాచారం అందించడంతో పెనుమూరు ఎస్ఐ అనిల్‌కుమార్ రంగంలో దిగి కేసును ఒక గంట వ్యవధిలో చేధించారు. ఈ హత్య అక్రమ సంబంధం పర్యావసనంగా జరిగిదని పోలీసులు తేల్చారు. వివరాలిలా వున్నాయి. ధనంజయనాయుడు మామిడి తోటకు రెండు జంటలు కాపలాగా వుండేవారు. ఇందులో శ్రీనయ్య, అమ్ములు భార్యభర్తలు కాగా హరి, గౌరిలు భార్యభర్తలు. అ క్రమంలో శీనయ్య భార్య అమ్ములుతో హరి ఏడాది కాలంగా అక్రమ సంబంధం పెట్టుకొన్నాడు. ఈ విషయం తెలిసిన శీనయ్య పలుమార్లు హరిని హెచ్చరించాడు. అయితే హరి పట్టించుకోకపోవడం శీనయ్య పథకం వేసి గురువారం రాత్రి హరితో మద్యం త్రాగించి హత్య చేశాడు. చాలా రోజులుగా మద్యం సేవించాలని చెప్పిన శీనయ్య హరిని పిలుచుకొని మామిడితోటలోని ఓ చెట్టు కింద బండపై మద్యం తాపించాడు. అప్పటికే శీను హరిని హత్య చేయాలని పథకం రచించి ఒక పెద్ద బండరాయిని సిద్ధం చేసుకొన్నాడు. మద్యం మత్తులో వున్న హరిపై శీనయ్య బండతో పలుమార్లు కొట్టి హత్య చేశారు. శీనయ్య, హరిలు మద్యం సేవించే సమయంలో అక్కడే గ్రామంకు చెందిన రమేష్ అనే వ్యక్తి వున్నాడు. రమేష్ గ్రామంలోకి వెళ్ళి శీనయ్య హరిని హత్య చేశాడని చెప్పాడు. అప్పటికే మామిడి తోటలో వున్న హరి భార్య గౌరి అక్కడి నుండి పరారీ అయ్యింది. హరిని హత్య చేసిన శీనయ్య తాను అక్కడి నుండి పారిపోయాడు. ఇన్స్‌పెక్టర్ మద్దయ్యాచ్చారి ఆధ్వర్యంలో పెనుమూరు ఎస్ఐ అనిల్‌కుమార్ కేసు విచారణ చేపట్టి నిందితుడు శీనయ్యను ఒక గంట వ్యవధిలో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. 02పెనుమూరు: నిందితుడిని అరెస్టు చేసిన సిఐ మద్దయ్యాచ్చారి, ఎస్ఐ అనిల్‌కుమార్‌లు

# సదుంలో మంత్రి పెద్దిరెడ్డి సుడిగాలి పర్యటన



సదుం, అక్టోబరు21 ప్రభాతవార్త : రాష్ట్ర అటవీ విద్యుత్‌పర్యావరణ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శుక్రవారం సదుంలో సుడిగాలి పర్యటన జరిపారు. ఇందులో భాగంగా జాండ్రపేటలోని సింగిల ్ విండో కార్యాలయం ఆవరణలో డీసీసీబ్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అపంతరం జిల్లా పరిషత్‌ఉ న్నత పాఠశాలలో శ్రీసత్యసాయి అన్నపూర్ణ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత అదనపు పౌష్టికాహార సేవను మంత్రి ప్రారంభించారు. పాఠశాల అభివృద్ధి కోసం రూ.6 కోట్లతో అదనపు భవనాలు నిర్మాణం జరుగుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మెన్ గోవిందప్ప శ్రీనివాసులు, జిల్లా జాయింట్‌కలెక్టర్ వెంకటేశ్వర్, తితిదేపాలక మండల సభ్యులు పోకల అశోక్‌కుమార్, డీఈఓ పురుషోత్తం, డీసీసీబ్యాంకు చైర్‌పర్సన్ రెడ్డెమ్మ,, జడ్పీ మాజీఉపాధ్యక్షుడు పెద్దిరెడ్డి, పలమనేరు కుప్పం మదనపల్లె అర్బన్‌డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మెన్ వెంకటరెడ్డి యాదవ్, ఎన్ఆర్ఈజీఎస్ స్టేట్ కౌన్సిల్ మెంబర్ విశ్వనాథ్, పలమనేరు డీఎస్పీగంగయ్య, జడీ ్టీసీ సోమశేఖరరెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప, మండల ఉపాధ్యక్షులు ధనంజయరెడ్డి, అమరావతి పుత్రాజు, అటవీశాఖ మాజీ డైరెక్టర్ వల్లివేడు రాజారెడ్డి, సమగ్ర శిక్ష అధికారి అజయ్‌కుమార్‌రెడ్డి, వైద్యశాల చైర్మెన్ కృష్ణారెడ్డి, సింగిల్ విండోచైర్మెన్ తిమ్మారెడ్డి, ఎంపీడీఓ వరప్రసాద్, తహశీల్దారు చంద్రశేఖర్, ఏపీఓ, ఏపీఎం, సర్పంచిలు, ఎంపీటీసీ సభ్యులు, వైకాపా నాయకులు పాల్గొన్నారు.

# ప్రేమ విఫలం...అప్పుల ఒత్తిడితో యువకుడు ఆత్మహత్య!



శ్రీకాళహస్తి, అక్టోబర్ 21 ప్రభాతవార్త : 'క్షణికావేశం ఆ తల్లిదండ్రులకు గర్భశోయం మిగిల్చింది. ప్రేమించిన యువతి తిరస్కరించటం భరించలేక పోయాడని సమాచారం. దీనికి తోడు తాను మధ్యలో ఉండి ఓ ఉద్యోగికి రూ.2లక్షలు అప్పు తీసి ఇచ్చాడు. అప్పు తీసుకున్న ఉద్యోగి సమాధానం చెప్పకపోవటంతో తీవ్ర మనోవేదనకు గురయ్యాడని కుటుంబ సభ్యులు వివరించారు. కానీ ఆతనికి ప్రేమించిన యువతి నిరాకరించటం జీర్ణించుకోలేక పోయాడు. గురువారం ఉదయం నుంచి రాత్రి 11.30గంటల వరకు పట్టణంలోనే ఉన్నాడు. తన స్నేహితులు, సన్నిహితులు, బంధువులకు ఫోన్ల ద్వారా తాను చనిపోతున్నట్లు సమాచారం అందించాడు. అంతేకాక బెంగుళూరులో ఉన్న తన సోదరునికి ఫోన్‌లో తాను రేణిగుంట సమీపంలో ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు సమాచారం అందించారు. దాంతో ఆతను రేణిగుంటలోని బంధువులకు సమాచారం అందించి వెతికించారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి దూర ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారు. అయితే యువకులు ఇదే అదనుగా ఫోన్ నెంబర్లు తీసుకొని ఛాటింగ్‌లు ఫేస్ బుక్ సంభాషణలు జరుపుతుంటారు. ఈ నేపథ్యంలో మణి కూడా వైజాగ్ నుంచి వచ్చి పూజలు జరిపించుకున్న అమ్మాయితో మణి ప్రేమలో పడట్లు తెలిసింది. నాలుగైదు సార్లు వైజాగ్‌కు కూడా వెళ్ళి వచ్చినట్లు చెబుతున్నారు. అయితే తన ప్రేమ విషయం తల్లిదండ్రులకు చెప్పారు. అయితే తల్లిదండ్రులు తాము వివాహం చేస్తామని భరోసా ఇచ్చినట్లు కానీ యువతి నిరాకరించిందని తన ఫోన్ తీయటం లేదని, మాట్లాడటం మానేసిందని తన బంధువులతో చెప్పుకొని రోదించినట్లు బంధువులు రోదిస్తున్నారు. ఇంత పని చేస్తాడని అనుకోలేదని తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. రైల్వే ట్రాక్‌మీదకు:

శ్రీకాళహస్తికి సమీపంలోని రైల్వేట్రాక్ దగ్గరకు చేరుకున్నాడు. బాగా తాగారు. సెల్‌ఫోన్‌ను అక్కడే పెట్టాడు. రైల్వేట్రాక్ మీద పడుకున్నాడు. దాంతో వేకువ జాము 3గంటల సమయంలో ఈ మార్గంలో వచ్చిన రైలు ఆతని మీదగా దూసుకెళ్లింది. రేణిగుంట ఎపోలీసు ఎస్ఐ అనిల్‌కు సమాచారం అందించటంతో ఆయన తన సిబ్బంది నరసింహా, మణి, ఇమాంలు సంఘటన స్థలానికి చేరుకున్నారు. ముక్కలు ముక్కలు అయిన బాడిని పోస్టు మార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి చేర్చారు. శవపరీక్ష తరువాత శవాన్ని తల్లిదండ్రులకు అప్పగించారు. కేసును రేణిగుంట రైల్వే పోలీసులు విచారిస్తున్నారు. మణి సంఘటన బూడిద మిట్టలో విషాదం నింపింది.

# అమరవీరుల త్యాగాలను స్మరించి..సన్మార్గంలో నడుద్దాం

## -పోలీసు అమరవీరుల సంస్మరణ సభలో వక్తలు



తిరుపతి/తిరుపతిక్రైమ్, అక్టోబర్ 21 ప్రభాతవార్త: ప్రజల రక్షణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ సన్మార్గంలో నడవాలని రాష్ట్రఉపముఖ్యమంత్రి కె.నారాయణ స్వామి, తిరుపతి ఎస్పి పి.పరమేశ్వరరెడ్డి అన్నారు. ప్రాణాలను ఫణంగా పెట్టి ప్రజల కోసం పోలీసులు చేసిన త్యాగాన్ని గుర్తించి సానుభూతి, గౌరవం చూపించడం మనందరి బాధ్యత అన్నారు. ఎండవాన పగలురాత్రి తేడాలేకుండా ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణకు కాపలాకాస్తుంటారని తెలిపారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఉదయం తిరుపతి పోలీసు జిల్లా ఎంఆర్‌పల్లిలోని పోలీసు ఫెరేడ్ మైదానంలో అమరవీరులను స్మరించుకుంటూ ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి, తిరుపతి ఎంపి డాక్టర్ గురుమూర్తి, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, నగరపాలక మేయర్ డాక్టర్ శిరిష, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే మధుసూదనరెడ్డి, ఎమ్మెల్సీ కల్యాణచక్రవర్తి, జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి ,జిల్లా ఎస్‌పి పరమేశ్వరరెడ్డి, టిటిడి సివిఎస్ఓ నరసింహకిశోర్, తిరుపతి నగరపాలక కమిషనర్ అనుపమఅంజలి, అదనపు ఎస్పీలు సుప్రజ, విమలకుమారి, కులశేఖర్, మునిరామయ్య, తిరుపతి పోలీసు జిల్లా డిఎస్పీలు మురళీకృష్ణ, నరసప్ప, విశ్వనాథ్, కాటమరాజు, విజయశేఖర్, జగదీశ్‌నాయక్, వేణుగోపాల్, సుధాకర్, కొండయ్య, రామరాజు, నందకిశోర్, సిఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొని అమరవీరుల స్థూపానికి పుష్పాంజలి ఘటించారు. అమరవీరుల కుటుంబసభ్యులకు పోలీసుశాఖ తరపున ఆర్థిక సహాయం, వారిని తగిన రీతిలో సత్కరించారు. పోలీసులు కర్తవ్యం పట్ల చిత్తశుద్ధితో అంతకుమించిన బాధ్యతతో, కనుపాపను కనురెప్ప కాపాడేలా ప్రజలను ,దేశాన్ని పోలీసులు కాపాడుతూ వాటి రక్షణలో భాగంగా ప్రాణాలను అర్పిస్తున్నారన్నారు. పోలీసుల త్యాగాలను, పోలీసుల సేవలను పలువురు కొనియాడారు.

# ప్రజల ఇళ్ల వద్దకే ఇకపై వైద్య సేవలు : ఎమ్మెల్సీ



శాంతిపురం, అక్టోబర్ 21 ప్రభాతవార్త : ప్రజల ఇళ్ల వద్దకే వైద్య సేవలను సిఎం జగనన్న అందుబాటులో తెచ్చారని చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ పేర్కొన్నారు. శివరాంపురం గ్రామ సచివాలయంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా ఉచితంగా 14 రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు, 67 రకాల అత్యవసర మందులు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో జడ్పీటిసి శ్రీనివాసులు, వైస్ ఎంపిపి రమేష్, సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, కార్యదర్శి అశ్వత్ నారాయణ, మండల కన్వీనర్ దండపాణి, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ పుష్పరాజ్, డా॥ లోకేష్ తదితరులు పాల్గొన్నారు. రామకుప్పం : కెంచనబళ్ల సచివాలయంలో ఫ్యామిలీ డాక్టర్ విధానంను విజలాపురం పిహెచ్‌సి డా॥ అల్తాఫ్ హుసేన్ అధ్వర్యంలో ప్రారంభించారు. అనంతరం ఈ వైద్య సేవల గురించి వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుబ్రమణ్యం, ఎంపిటిసి చలపతి, డా॥ జ్ఞానేంద్ర, సిబ్బంది బాలయ్య, సంధ్య, కావ్య, లావణ్య, సుకన్య, ఆశ, సరిత తదితరులు పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపుకు కృషి చేయాలి

## - తెదేపా రాష్ట్ర నేత గోపీనాథ్



కుప్పంరూరల్, అక్టోబర్ 21 ప్రభాతవార్త : తూర్పు రాయలసీమ నియోజకవర్గం పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెదేపా అభ్యర్థి డా॥ శ్రీకాంత్ గెలుపుకు పార్టీ నేతలు, కార్యకర్తలు కృషి చేయాలని తెదేపా రాష్ట్ర నేత గోపీనాథ్ కోరారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఓటర్ల నమోదు కార్యక్రమంకు అవకాశం ఉందని దీంతో గ్రామాల్లో, పట్టణాల్లో డిగ్రీ పూర్తి చేసిన వారిని నూతన ఓటర్లుగా నమోదు చేయించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అలాగే వైకాపా ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎప్పటికప్పుడు తీసుకెళ్లి వారిలో చైతన్యం కలిగించాలన్నారు. రాష్ట్రంలో మరలా అధికారంలో వచ్చేది చంద్రబాబేనని కుప్పంలో ఆయన మెజార్టీ పెంపుకు కృషి చేయాలని కోరారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి డా॥ వెంకటేష్, మున్సిపల్ ప్రధాన కార్యదర్శి ఆర్ముగం, కౌన్సిలర్లు సురేష్‌కుమార్, జాకీర్, రవి నాయక్, నాను, టిఎన్ఎస్ఎఫ్ మునెప్ప, అప్పు, విష్ణు, లోకేష్, నరేష్, లక్ష్మీపతి, గిరి తదితరులు పాల్గొన్నారు.

# దోపిడిలో వైకాపా నాయకులు పోటీపడుతున్నారు : గాలి



పుత్తూరు, అక్టోబరు 21 ప్రభాతవార్త : రాష్ట్రంలో కొండలు, గుట్టలు, ఇసుక, మట్టి కొల్లగొడుతూ దోపిడీ చేయడంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పోటీ పడుతున్నారని తెలుగుదేశం పార్టీ నగరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గాలి భానుప్రకాష్ ఆరోపించారు. మాజీ ఎంపిపి గంజి మాధవయ్య నేతృత్వంలో పుత్తూరు రూరల్ మండల పరిధిలోని శుక్రవారం రామకృష్ణాపురం పంచాయ తీలోని కశింకుప్పం, గొల్లపల్లి, హరిజనవాడ, శిరుగురాజుపా లెం పంచాయ తీల్లో మీ కోసం - మీ తెలుగుదేశం పార్టీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా భానుప్రకాష్ గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎవరికీ మినహాయింపు లేకుండా సమాజంలో అన్ని వర్గాల వారికి బాదుడే.. బాదుడే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి అమలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో మూడున్నర ఏళ్ల వైకాపా పాలనలో ఒక పరిశ్రమ కూడా రాలేదని, ఒక్క ఉద్యోగం కూడా రాలేదన్నారు. రైతులకు విత్తనాలు ఇవ్వడం లేదని, గిట్టుబాటు ధర కల్పించడం లేదని ఫర్యవసానంగా రాష్ట్రంలో వ్యవసాయం సంక్షోభంలో వుందన్నారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ, రూరల్ విభాగాల అధ్యక్షులు గాలి జీవరత్నంనాయుడు, డి.రవి కుమార్, బిసి సెల్ చిత్తూరు పార్లమెంట్ అధ్యక్షుడు సిహెచ్. షణ్ముగరెడ్డి, అధికార ప్రతినిధి చినబాబు, తడుకు సర్పంచ్ వెంకటేష్ యాదవ్, విజయ పురం నాయకులు దశరథరాజు, బాబుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# నేథమ్స్ షుగర్ ఫ్యాక్టరీ చెరుకు రైతులు 22న ధర్నా



నింద్ర, అక్టోబరు 21 ప్రభాతవార్త : నేథమ్స్ షుగర్ ఫ్యాక్టరీ రైతులు అక్టోబరు 22వతేదిన ఫ్యాక్టరీ ఎదుట పెద్దఎత్తున చెరుకు రైతులు ధర్నా చేయనున్నట్లు నేటమ్స్ షుగర్ ఫ్యాక్టరీ రైతు నాయకులు అధ్యక్షులు ఆదినారాయణరెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రంలో రైతు నాయకుల అధ్యక్షులు ఆదినారాయణరెడ్డి విలేకర్లు సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేటమ్స్ షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం చెరుకు రైతులకు చెల్లించవలసిన 37కోట్ల బకాయిలను గత నాలుగు సంవత్సరాలుగా చెల్లించకుండా కాలాయాపన చేయడంతో రైతులు ఫ్యాక్టరీ ఎదుట ధర్నా చేయనున్నట్లు ఆయన తెలిపారు. నింద్ర, విజయపురం, పిచ్చాటూరు, నాగలాపురం, కెవి పురం, నగరి, పుత్తూరు, వడమాలపేట, నారాయణవనం, మండలంలోని రైతులు తరలిరావలెనని తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాసులుయాదవ్, రఘురెడ్డి, రాధారెడ్డి, కన్నివేలురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# దుర్గమ్మ ఆలయం మండలాభిషేకం



శ్రీకాళహస్తి, అక్టోబర్ 21 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న కనకాచలంపై వెలసిన కనక దుర్గమ్మ ఆలయంలో కుంభాభిషేకం నిర్వహించారు. కు ంభాభి షేకం జరిపి 41 రోజులు అయిన సందర్భంగా శుక్రవారం 'మండలాభిషేకం'ను నిర్వహించారు. శుక్రవారం ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, పాలకులు హాజరు కాగా భక్తిశ్రద్దలతో అమ్మవారి మూల విరాట్టుకు షోడషాభిషేకాలు జరిపారు. ఈ కార్యక్రమాల్లో అంజూరు తారక శ్రీనివాసులుతో పాటు ప్రత్యేకాహ్వానితులు చింతామణి పాండు, వెంకటసుబ్బయ్య, చిన్న ఆలయాల ఇన్‌చార్జి లక్ష్మయ్య, ఆలయ అర్చకులు అభిషేక గురుకుల్ నిరంజన్ పౌరోహితులు అర్ధగిరి, తులసీ శర్మ, గోవింద్‌స్వామి తదితరులు పాల్గొన్నారు. మండలాభిషేకంలో పట్టణానికి చెందిన మహిళా భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

# అర్ధనారీశ్వరాలయంలో నాగపడగ వితరణ




తొట్టంబేడు, అక్టోబర్ 21 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న విశాలక్ష్మమ్మ పురంలో వెలసిన అర్ధనారీశ్వరాలయంలో వెలసిన స్వయంభువుకు ముఖ ప్రతిమ నాగపడగను బహూకరించారు. శుక్రవారం రాష్ట్ర దేవాంగుల సంఘ యువత అధ్యక్షుడు పులిరామచంద్రయ్య సుమారు రూ.41వేల వ్యయంతో తయారు చేసిన వెండి కవచాన్ని తయారు చేయించి వితరణగా అందించారు. ఈ ఉరువులను ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు సాధ్యంలో ఆలయానికి అందజేసారు. పరమేశ్వరునికి ప్రతీపాత్రమైన రుద్రాక్ష మరియు నాగమల్లి చెట్లను నాటారు. పులి రామచంద్రను చైర్మెన్ శ్రీనివాసులు సత్కరించారు.

# కార్మికులకు సాయం చేయడంలో ఆనందం ఉంది!



తిరుపతి ప్రెస్‌క్లబ్, అక్టోబర్ 21 ప్రభాతవార్త: కార్మికులు సంతోషంగా ఉడటం కోసం వారికి సహాయం చేయడంలో ఆనందం ఉందని వాకర్స్ అసోసియేషన్ సభ్యుడు జగన్నాధం అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక మున్సిపల్ పార్కులో అక్కడ పనిచేసే కార్మికులకు దీపావళి పండుగ సందర్భంగా మహిళలకు చీరలు, జాకెట్లు, పురుషులకు పంచెలు, టవళ్లు, ప్లేట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్కు కాంట్రాక్టర్ నాగిరెడ్డి, కోలా లక్ష్మీపతి, కార్పొరేటర్ మురళి, యోగ వెంకటేష్, కమలమ్మ, హేమమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# న్యాయ సమీక్షకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు అంశం!



తిరుపతి ప్రెస్‌క్లబ్, అక్టోబర్ 21 ప్రభాతవార్త: ఏపిఎస్‌పిడిసిఎల్ పరిధిలోని చిత్తూరు, నెల్లూరు, కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల పరిధిలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు టెండర్లను పిలవడానికి ముందుగా, సంబంధింత డాక్యుమెంట్లను న్యాయ సమీక్షకు పంపినట్లు సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోషరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విద్యుత్ పంపిణీ పునర్వ్యవస్థీకరణ పథకం(ఆర్డీఎస్ఎస్)లో భాగంగా అడ్వాన్స్ మీటరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సర్వీస్ ప్రొవైడర్(ఎఎంఐఎస్‌పి) ద్వారా సంస్థ పరిధిలో 33కెవి, 11కెవి ఫీడర్లు డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన పాత మీటర్ల స్థానంలో స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేసేందుకు అవసరమైన ప్రక్రియ కొనసాగు తోందన్నారు. ఈ అంశంపై ప్రజలు, వినియోగదారులు తమ సలహాలు, సూచనలు, అభ్యంతరాలను నవంబర్ 1వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు జ్యుడిషియల్ కమిషన్ వెబ్‌సైట్‌లో పొందుపరచాలని సిఎండి సంతోషరావు కోరారు.

## తిరుపతి నగరాభివృద్ధికి కార్మికుల అండతో ముందుకు వెళ్తాం -మేయర్, కమిషనర్



తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 21, ప్రభాతవార్త : తిరుపతి నగరాభివృద్ధికి కార్మికుల అండతో ముందుకు వెళ్తామని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ డా. శిరీషా, కమిషనర్ అనుపమ అంజలి అన్నారు. తిరుపతి నగర పాలక సంస్థ కార్యాలయంలో శుక్రవారం ఆయుధపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ శిరీషా, కమిషనర్ అనుపమ అంజలిలు మాట్లాడుతూ నగర పాలక సంస్థ కార్మికులు చేపట్టిన కార్యక్రమాలు విజయవంతం కావాలని ఆక్షాంక్షించారు. కార్మికులు, సిబ్బంది కృషితో ఈ సంవత్సరం చివరికల్లా చేపట్టిన అన్నిప్రాజెక్టులు పూర్తి అవుతుందని అన్నారు. నగర పాలక సంస్థ నిర్వహణలోని వాహనాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, కార్మికులకు మేయర్ శిరీషా, కమిషనర్ అనుపమ అంజలి అభినందనలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు నరసింహాచారి, దూది కుమారి, రుద్రరాజు శ్రీదేవి, అదనపు కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, ఎంఈలు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, హెల్త్ ఆఫీసర్ డా. హరికృష్ణ, డిఈలు రవీంద్రరెడ్డి, సంజయ్ కుమార్, గోమతి, దేవిక, సెక్రటరీ రాధిక, మేనేజర్ చిట్టిబాబు, శానిటరి సూపర్‌వైజర్ చెంచెయ్య పాల్గొన్నారు.

## పంట నమోదు రైతుల జాబితాను పరిశీలించిన అగ్రికల్చర్ డిప్యూటీ డైరెక్టర్



బుచ్చినాయుడు కండ్రిగ, అక్టోబరు 21 ప్రభాతవార్త: ఖరీఫ్ 2022 సీజన్‌కు సంబంధించి ఈ పంట నమోదు చేసుకున్న రైతుల జాబితాను శుక్రవారం మండలంలోనఇ 7 రైతు భరోసా కేంద్రాల్లో నమోలిస్తును ఆకస్మికంగా డిప్యూటీ డైరెక్టర్ అగ్రికల్చర్ ఆఫీసర్ ప్రసాద్‌రావు పరిశీలించారు. పార్లపల్లి, పల్లమాల, కాటూరు, ఆలత్తూరు, నీరప్పకోట, వెస్ట్ వారత్తూరు, ఆర్ అనంతపురం గ్రామ పంచాయతీల్లోని ఆర్‌బీకే కేంద్రాల్లో ఈ పంట 2022 సీజన్ సంబంధించి రైతులు నమోదు చేసుకున్న జాబితాను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

# ఎంత మంది వస్తే అంతమందికి భోజనాలు: ఇఓ సాగర్‌బాబు



శ్రీకాళహస్తి, అక్టోబర్ 21 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయానికి ఎంత మంది వస్తే అంతమందికి భోజనాలు అందిస్తామని ఆలయ ఇఓ సాగర్‌బాబు శుక్రవారం తెలిపారు. శుక్రవారం శ్రీకాళహస్తికి చెందిన తిరుపతి బైరాగిపట్టెడలో స్థిరపడ్డ నరసింహారెడ్డి కుటుంబసభ్యులతో స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఇఓ సిసి సుధీర్‌తోకలసి తాము అన్నదానానికి విరాళం ఇవ్వటానికి వచ్చినట్లు వివరించారు.

# కల్యాణ వెంకన్నకు పవిత్రోత్సవాలు

చంద్రగిరి, అక్టోబర్ 21 ప్రభాతవార్త: శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి వారికి శుక్రవారం స్నపన తిరుమంజన సేవ కన్నుల పండువగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్వామి వారిని వేకువజామున సుప్రభాతసేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలను ఆగమోక్తంగా నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత స్వామి వారి ఉత్సవమూర్తులను కల్యాణ మండపానికి వేంచేపుగా తీసుకుచ్చారు. ఉదయం 11 గంటల నుండి 12 గంటల వరకు స్నపన తిరుమంజన సేవ అంగరంగ వైభవంగా జరిపించారు. సాయంత్రం 6.30 నుండి 8 గంటల వరకు యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహించి, పవిత్ర ప్రతిష్ట గావించారు. పవిత్రోత్సవాలలో పాల్గొనదలచిన గృహస్థులు (ఇద్దరు) రూ.500/-లు చెల్లించి పాల్గొనవచ్చు న్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గురుమూర్తి, సూపరింటెండెంట్స్ మునిచెంగల్రాయులు, దాసరి రమణయ్య, ఆలయ ప్రధాన అర్చకులు, కంకణదారులు బాలాజీ రంగాచార్యులు, పాల్గొన్నారు.

# వాహనదారులు నిబంధనలు పాటించాలి : ఎంవిఐ

పుత్తూరు, అక్టోబరు 21 ప్రభాతవార్త : వాహనాలు నడిపేవారంతా కచ్చితంగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని పుత్తూరు మోటారు వాహనాల తనిఖీ అధికారి చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజీలో రోడ్డు భద్రతపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన అధ్యాపకులు, విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. వాహనదారులు నిబంధనలకు అనుగుణంగా వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలను నివారించవచ్చన్నారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి వుండాలన్నారు. హెల్మెట్‌లు ధరించాలన్నారు. కార్లలో ప్రయాణించేవారు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. అతి వేగంగా వాహనాలు నడపడమే కాకుండా ముందు వెళుతున్న వాహనాలను అనవసరంగా ఓవర్ టేక్ చేయాలని అత్యుత్సాహం చూపించడం వల్ల వాహనం నడిపే వారికే కాకుండా ఇతర వాహనదారులను కూడా ప్రమాదానికి గురి చేసినవారవుతారని వివరించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే ప్రమాదాల బారిన పడతారని హెచ్చరించారు. నిబంధనలు పాటించని వాహనదారులకు విధించే వివిధ రకాల జరిమానాలను ఆయన వివరించారు. అనంతరం యాజమాన్యం తరపున ఆయనకు అధ్యాపకులు శాలువా కప్పి సన్మానం చేశారు.

# జోడోయాత్రకు విశేష స్పందన

శ్రీకాళహస్తి, అక్టోబర్ 21 ప్రభాతవార్త

రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్‌జోడోయాత్ర ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన యాత్రకు శ్రీకాళహస్తి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి మరియు రాష్ట్ర కాంగ్రెస్‌పార్టీ అధికార ప్రతినిధి డాక్టర్ ఎస్.బత్తెయ్యనాయుడు ఆధ్వర్యంలో 18,19,20 తేదీల్లో రాహుల్‌గాంధీ పాదయాత్రలోపాల్గొన్నారు. ఈజోడో యాత్రలో ప్రజల్లో విశేషస్పందన వచ్చిందని 42రోజులుగా తమిళనాడు, కేరళ, కర్నాటక రాష్ట్రాల్లో ఆయన పాదయాత్రకు ప్రజలు వేలసంఖ్యలో పాల్గొని సంఘీభావం తెలిపిన విషయం సోషల్‌మీడియాలో చూడడం జరిగిందని ఆయన ప్రజలతో మమేకమై వారి సాధక బాధలను తెలుసుకుంటూ క్షేత్రస్థాయిలో తెలుసుకుంటూ బిజెపిపెట్రోలు, డీజల్, వంటగ్యాస్, నిత్యావసర సరుకులు పెంచి ప్రజల నడ్డి విరుస్తున్నారని మతత్వ విద్వేషాలను రెచ్చగొడుతూరని రాహూల్ గాంధీ తెలిజయేశారని బత్తెయ్యనాయుడు తెలపారు. కాంగ్రెస్ పార్టీలో కేంద్రంలో అధికారంలోకి రాగానే వంటగ్యాస్ రూ.400, పెరిగిన నిత్యావసరసరుకుల ధరలను, తదితర వస్తువులను అదుపులోకి తీసుకుని చేస్తుందని. కాంగ్రెస్ పార్టీ రైతుల రుణమాఫీ విషయంలో ఆలోచిస్తుందన్నారు.